RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక

సంచిక 37 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | ఆగస్టు 05, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## నీలగిరి నిత్యపద్యం

వలనుబట్టు వార్కి వలసిన చేపలు
ఈతగొట్టు వార్కి ముత్యములును
దరిననున్న వార్కి తడుచును పాదముల్
కడలివలన మనకు కలుగునయ్య

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

**పూర్తి వివరాలకు**

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.


## పారదర్శకంగా పోలీస్ ఉద్యోగ నియామకాలు

**- పరీక్షల నిర్వహణపై ప్రత్యేక నిఘా**

**- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం**

**హైదరాబాద్,ఆగస్టు 4 :** పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 7,437 పోస్టుల భర్తీ ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని రాజకీయ పార్టీలతో పాటు ఇతర శక్తులు ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు సీఎం దృష్టికి తీసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్ తో పాటు ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. నియమ, నిబంధనలనుసరించి ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాతో పాటు అన్ని ప్రక్రియల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని డీజీపీని ఆదేశించారు. కోచింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణపై సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ఎలాంటి దుష్ప్రచారం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసే దళారులు, నకిలీ వెబ్ సైట్లు, సోషల్ మీడియా అకౌంట్లపై సైబర్ క్రైమ్ విభాగంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ పూర్తయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ, ఇంటలీజెన్స్ విభాగం పూర్తి **మిగతా 2లో...**



## తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



**'అమరజీవి జలధార' గోదావరి జిల్లాల తాగునీటి సమస్యకు పరిష్కారం: పవన్ కల్యాణ్**

**జల్ జీవన్ మిషన్ కింద అమలవుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు**

**తీరప్రాంతాల్లోని 33 లక్షల మందికి సురక్షిత మంచినీటిని అందించడమే లక్ష్యం**

**నిర్దేశిత వ్యవధిలోనే నిర్మాణాలను పూర్తి చేయాలన్న పవన్**

**అమరావతి,ఆగస్టు 4 :** జల్ జీవన్ మిషన్ కింద చేపడుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఈ ప్రాజెక్టు **మిగతా 2లో...**

## ట్రంప్ తాజా సుంకాలు చట్టవిరుద్ధం

**కోర్టులో వ్యాజ్యం వేసిన అమెరికా రాష్ట్రాలు**



**వాషింగ్టన్,ఆగస్టు 4 :** భారత్ సహా 60 వాణిజ్య భాగస్వామ్య దేశాల నుంచి దిగుమతి అవుతున్న వస్తువులపై 10 నుంచి 12.5 శాతం వరకూ కొత్తగా సుంకాలు విధించాలని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అమెరికాలోని ఇరవై ఐదు రాష్ట్రాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. ఈ సుంకాలు అక్రమమైనవని, ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు కొట్టివేసిన దిగుమతి పన్నుల స్థానంలో ట్రంప్ ప్రభుత్వం వీటిని తీసుకొచ్చే ప్రయత్నం చేసిందని ఆరోపించాయి. సుంకాల విధింపును కొట్టివేయాలని, వాటిని చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించి ఇప్పటికే వసూలు చేసిన సొమ్మును తిరిగి వాపసు చేసేలా చూడాలని యూఎస్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్‌లో దాఖలు చేసిన వ్యాజ్యంలో ఆ రాష్ట్రాలు అభ్యర్థించాయి. 59 రాష్ట్రాలు, యూరోపియన్ యూనియన్‌పై గత నెలలో విధించిన సుంకాలు అమెరికా దిగుమతు లలో 99.4 శాతం వాటాను కలిగి ఉన్నాయని రాష్ట్రాలు వాదించాయి. కార్మికులతో బలవంతంగా పనులు చేయించి తయారు చేసిన వస్తువుల దిగుమతులను ఆపాలని కోరినప్పటికీ ఆయా దేశాలు పట్టించుకోలేదని ట్రంప్ ప్రభుత్వం చెబుతోంది. 'సుప్రీంకోర్టులో ఎదురు దెబ్బ తగిలిన తర్వాత **మిగతా 2లో...**

## తెలంగాణలో వర్షాలు పడకుండా క్షుద్రపూజలు

**- మాజీమంత్రి హరీష్ రావుపై పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ ఆరోపణలు**

**హైదరాబాద్,ఆగస్టు 4 :** బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీశ్ రావుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్య లు చేశారు. తెలంగాణలో వర్షాలు పడకూడదని, కరువు రావాలని కోరుకుంటూ ఆయన క్షుద్ర పూజలు చేశారని **మిగతా 2లో...**






## పోటెత్తుతున్న వరద..

**వేగంగా నిండుతున్న శ్రీశైలం డ్యామ్**

**ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణమ్మకు పోటెత్తుతున్న వరద**

**నాగార్జునసాగర్ ఇన్‌ఫ్లో 900 క్యూసెక్కులు**

## గుజరాత్‌లో చండీపుర వైరస్‌తో 22 మంది మృతి..

**15 ఏళ్లలోపు పిల్లలకు ఎక్కువ ప్రమాదం**

**జ్వరం తర్వాత మెదడుపై దాడి చేసే అవకాశం**

**టీకా, ప్రత్యేక మందు ప్రస్తుతం లేవు**

**లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి**

**కీటకాల నుంచి రక్షణే ప్రధాన నివారణ**




## పెద్ద ఎత్తున కల్తీ మసాలాల తయారీ

25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం

13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు

కల్తీ మసాలాలలో క్యాన్సర్ వంటి ప్రమాదాలు

కల్తీలపై సిట్ ద్వారా దర్యాప్తు చేపడతాం

ఇప్పటికే ముగ్గురు నిందితుల అరెస్టు

నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడి



**హైదరాబాద్,ఆగస్టు 4 :** ఆహార కల్తీకి పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్న హెచ్-ఫాస్ట్ అధికారులు భారీ ఆపరేషన్ నిర్వహించి పెద్ద ఎత్తున మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలో పలు చోట్ల తనిఖీలు చేపట్టి 25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నట్టు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించి.. 25.3 టన్నుల కల్తీ మసాలా దినుసులు, 89.15 టన్నుల ముడిపదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. **మిగతా 2లో...**

## జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్..

### పార్లమెంట్‌లో బిల్లుకు ఆమోదం!

ఆలస్యంగా చేసే రిజిస్ట్రేషన్లకు కఠినమైన నిబంధనలు

రెండేళ్లు దాటితే జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు అవసరం

దేశంలో 99 శాతానికి పైగా పెరిగిన జనన, మరణాల నమోదు

గుర్తింపు మోసాలను అరికట్టడమే లక్ష్యమని తెలిపిన కేంద్రం



**న్యూఢిల్లీ,ఆగస్టు 4 :** దేశంలో జనన మరణాల నమోదు ప్రక్రియను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కీలక బిల్లుకు పార్లమెంట్ ఆమోద ముద్ర వేసింది. జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు-2026కు మంగళవారం రాజ్యసభ ఆమోదం తెలిపింది. **మిగతా 2లో...**

## ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్

**ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశం**

**హైదరాబాద్,ఆగస్టు 4 :** తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని అధికారులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో టీ-ఫైబర్ సేవల విస్తరణపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్ణీత గడువులోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ-÷బైర్ కనెక్టివిటీ కల్పించాలని స్పష్టం చేశారు. **మిగతా 2లో...**



## అగమ్య గోచరంగా ప్రభుత్వాసుపత్రులు

**ప్రత్యేక వైద్యసేవలు అందక ప్రజల ఇక్కట్లు**

**కమిషనర్ లేక గాలిలోద**

**దీపంలా వైద్యవిధాన పరిషత్**

**సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు**

**హైదరాబాద్,4 :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వాస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన గైనకాలజీ, ఆర్థోపెడిక్, యూరాలజీ, పీడియాట్రిక్ తదితర ప్రత్యేక వైద్య సేవలను అందించే తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిస్థితి కమిషనర్ లేక **మిగతా 2లో...**



# తెలంగాణలో వర్షాలు పడకుండా క్షుద్రపూజలు

**మొదటిపేజీ తరువాయి**

మహేశ్ గౌడ్ ఆరోపించారు. అందుకు తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అరుంధతి సినిమా తరహాలో ఆయన పూజలు నిర్వహిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు ఈ ఏడాది మార్చి 2న తమిళనాడులోని తిరుచ్చికి, జూన్ 1న కర్ణాటకలోని శివమొగ్గకు వెళ్లారని.. ఆ తేదీల్లో ఆయన ఎక్కడ ఉన్నారో ప్రజలకు వివరించాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. తిరుపతికి వెళ్లినప్పుడు మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. అఘోరీ ఆలయానికి వెళ్లిన విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచారని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం కోసం దేవుడిని ప్రార్థించడం సహజమని.. కానీ మాజీ మంత్రి మాత్రం ప్రజలకు కీడు జరగాలని పూజలు చేశారని విమర్శించారు.

తన రాజకీయ స్వార్థం కోసమే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై నిజాలు బయటపెట్టినందుకే అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్‌లకు లీగల్ నోటీసులు పంపించారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అయితే లీగల్ నోటీసులకు తాము భయపడబోమని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అఘోరాలతో క్షుద్ర పూజలు చేశారనే ప్రచారం గతంలో జరిగిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ చెప్పారు. ఇప్పుడు హరీశ్ రావుపై వస్తున్న ఆరోపణలతో కేసీఆర్ పూజలు కూడా నిజమేనని అనిపిస్తోందన్నారు. యాదగిరిగుట్టకు వెళ్లి పొర్లు దండాలు పెట్టి మరీ ఏం చేశారో ప్రజలకు హరీశ్ రావు చెప్పాలని ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. గతంలో మంత్రాలు, తంత్రాల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన ఘటనలు ఉన్నాయని, దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఇలాంటి ఆచారాలను బలంగా నమ్ముతారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

# పారదర్శకంగా పోలీస్ ఉద్యోగ నియామకాలు

**మొదటిపేజీ తరువాయి**



అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. సమావేశంలో సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, డీజీపీ సీవీ ఆనంద్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వివి.శ్రీనివాస రావు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

# పోటెత్తుతున్న వరద..

**హైదరాబాద్,ఆగస్టు 4 :**
ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైలం జలాశయానికి కృష్ణా నది వరద ప్రవాహం పోటెత్తుతోంది. ఐదు రోజుల క్రితం ప్రవాహం ప్రారంభమైన సమయంలో 820 అడుగులుగా ఉన్న నీటిమట్టం, నిన్న సాయంత్రానికి 855.10 అడుగులకు చేరింది. ప్రస్తుతం డ్యామ్‌లో 92.048 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఈ సాయంత్రానికి ఈ నిల్వలు 100 టీఎంసీల మార్కును దాటుతాయని ప్రాజెక్టు అధికారులు అంచనా వేస్తున్నారు.శ్రీశైలం జలాశయం: జూరాల నుంచి సోమవారం 2.21 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, రాత్రి సమయానికి శ్రీశైలానికి 1.55 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. రోజుకు లక్ష క్యూసెక్కులకు పైగా వచ్చే ఈ వరద ఉద్ధృతి మరో నాలుగైదు రోజులు కొనసాగవచ్చని శ్రీశైలం డ్యామ్ సీఈ కబీర్ బాషా తెలిపారు.ఎగువ కర్ణాటక ప్రాజెక్టులు: ఆలమట్టి డ్యామ్‌లోకి 1,25,855 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువకు 1.50 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టులోకి 1,28,954 క్యూసెక్కులు వస్తుండగా, 1,40,880 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.జూరాల ... తుంగభద్ర: నారాయణపూర్ నుంచి వస్తున్న నీటికి భీమా నది వరద జలాలు తోడవడంతో జూరాలకు ఏకంగా 1.92 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. వచ్చిన వరదను దృష్టిలో ఉంచుకొని జూరాల నుంచి 2,21,765 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. తుంగభద్ర డ్యామ్‌లోకి 57,785 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది.నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం 136 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఎగువ నుంచి 900 క్యూసెక్కులు వస్తున్నాయి. పులిచింతలలో 28.91 టీఎంసీల నీటినిల్వ ఉంది. ప్రకాశం బ్యారేజీలోకి 6,958 క్యూసెక్కులు చేరుతుండగా, 6,499 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

# ట్రంప్ తాజా సుంకాలు చట్టవిరుద్ధం

**మొదటిపేజీ తరువాయి**
ట్రంప్ ప్రభుత్వం కుటుంబాలు, వ్యాపారాలపై కొత్త టారిఫ్‌లతో భారం మోపాలని మరోసారి ప్రయత్నిస్తోంది' అని న్యూయార్క్ అటార్నీ జనరల్ లెతితియా జేమ్స్ ఓ ప్రకటనలో తెలిపారు.ప్రభుత్వం తన చర్యను ఏ విధంగా సమర్థించుకుంటున్నప్పటికీ తాను కోరుకున్న దేశాలపై అధిక సుంకాలు విధించేందుకు దేశాధ్యక్షుడికి అధికారం లేదని అమెరికా చట్టం, రాజ్యాంగం స్పష్టం చేస్తున్నాయని ఆయన అన్నారు. ట్రంప్ ప్రభుత్వ ప్రయత్నాలకు వ్యతిరేకంగా న్యాయస్థానంలో వ్యాజ్యం వేసిన రాష్ట్రాలలో న్యూయార్క్, కాలిఫోర్నియా, ఇల్లినాయిస్, మాసాచూసెట్స్, వాషింగ్టన్, విల్కాన్సిస్ సహా 18 రాష్ట్రాలు, కెంటుకీ, పెన్సిల్వేనియా గవర్నర్లు ఉన్నారు. విముక్తి దినోత్సవం సందర్భంగా ట్రంప్ ప్రభుత్వం విధించిన సుంకాలను రాజ్యాంగ విరుద్ధమైనవిగా న్యాయస్థానం గతంలో తీర్పు ఇవ్వడంతో 1974వ సంవత్సరపు వాణిజ్య చట్టంలోని సెక్షన్ 301 కింద కొత్తగా ముందుకు తెచ్చిన టారిఫ్‌లు గత నెల నుంచే అమలులోకి వచ్చాయి. ఈ కొత్త సుంకాల కారణంగా ప్రధాన వాణిజ్య భాగస్వాములైన కెనడా, జపాన్, నార్వే, తైవాన్, చైనాలపై బాగా ప్రభావం పడుతుంది. కాగా ట్రంప్ తన కార్యనిర్వాహక అధికారాన్ని అతిక్రమించారంటూ రెండు చిన్న వ్యాపార సంస్థల తరఫున లిబర్టీ జస్టిస్ సెంటర్ కూడా విడిగా వ్యాజ్యాన్ని వేసింది. బలవంతంగా పనులు చేయిస్తున్నారన్న పేరుతో ప్రభుత్వం సుంకాలను భారీగా పెంచిందని, ఇది వినియోగదారులపై అధిక ఆర్థిక భారాన్ని మోపిందని న్యూయార్క్ గవర్నర్ కాథీ హోచల్ విమర్శించారు.

# గుజరాత్‌లో చండీపుర వైరస్‌తో 22 మంది మృతి..

**గుజరాత్,ఆగస్టు 4 :**
గుజరాత్‌లో చండీపుర వైరస్ మరోసారి కలకలం రేపుతోంది. ఈ వైరస్ కారణంగా ఇప్పటివరకు 22 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. మరో 35 మందికి వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. సాధారణ జ్వరంలా మొదలయ్యే ఈ ఇన్‌ఫెక్షన్ కొన్ని గంటల్లోనే మెదడుపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉండటంతో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అసలు చండీపుర వైరస్ అంటే ఏంటి? ఇది ఎలా వ్యాపిస్తుంది? లక్షణాలు ఏంటి? చికిత్స ఉందా? తెలుసుకుందాం..



### ఏంటీ వైరస్?
రాబ్డోవిరిడే కుటుంబానికి చెందినదే ఈ చండీపుర వైరస్ (సీహెచ్‌పీవీ). దీన్ని తొలిసారి 1965లో భారత్‌లో గుర్తించారు. వర్షాకాలంలో ఎక్కువగా కనిపించే శాండ్‌ఫ్లై (ఇసుక ఈగ) వల్ల ఇది వ్యాపిస్తుంది. మనుషుల నుంచి మనుషులకు ఈ వైరస్ సోకినట్లు ఇప్పటివరకు ఆధారాలు లేవు.

### ఎవరికి ఎక్కువ ప్రమాదం?
ఈ వైరస్ ఎక్కువగా 15 ఏళ్లలోపు చిన్నారులపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, శాండ్‌ఫ్లైలు ఎక్కువగా ఉండే చోట్ల ప్రమాదం అధికంగా ఉంటుంది. వర్షాకాలంలో ఈగల సంఖ్య పెరగడంతో వైరస్ వ్యాప్తి కూడా ఎక్కువగా కనిపిస్తుంది.

### మొదట కనిపించే లక్షణాలు ఏవి?
ప్రారంభంలో ఈ వైరస్‌ను గుర్తించడం కాస్త కష్టం. ఎందుకంటే మొదట సాధారణ వైరల్ జ్వరంలాగే కనిపిస్తుంది. జ్వరం, తలనొప్పి, వాంతులు, విరేచనాలు, నీరసం, ఫ్లూ లక్షణాలు ఉంటాయి. ఈ దశలో చాలామంది సాధారణ జ్వరంగా భావించే అవకాశం ఉంటుంది.

### ఎందుకు ప్రమాదకరం?
కొంతమంది చిన్నారుల్లో వైరస్ చాలా వేగంగా మెదడుపై దాడి చేస్తుంది. దీంతో మెదడు వాపు (ఎన్‌సెఫలైటిస్) వస్తుంది. ఆ తర్వాత పరిస్థితి గంటల వ్యవధిలోనే విషమించవచ్చు.

### తీవ్రమైన లక్షణాలు ఇవీ..
మూర్ఛ, స్పృహ కోల్పోవడం, కోమాలోకి వెళ్లడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందుల వంటి తీవ్రమైన లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని కేసుల్లో ఆసుపత్రిలో చేరిన 48 నుంచి 72 గంటల్లోనే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

### చికిత్స ఉందా?
ప్రస్తుతం చండీపుర వైరస్‌కు ప్రత్యేకంగా పనిచేసే మందు లేదు. టీకా కూడా అందుబాటులో లేదు. రోగికి కనిపించే లక్షణాలను బట్టి చికిత్స అందిస్తారు. శ్వాస, రక్తపోటు వంటి కీలక అవయవాల పనితీరును నిలకడగా ఉంచే ప్రయత్నం చేస్తారు. అందుకే లక్షణాలు కనిపించగానే ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లడం కీలకం.

### ఎలా జాగ్రత్త పడాలి?
చండీపుర వైరస్‌కు ప్రత్యేక టీకా లేకపోవడంతో నివారణే ఉత్తమ మార్గం. శాండ్‌ఫ్లై కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలకు పూర్తి చేతులు కవర్ అయ్యేలా దుస్తులు వేయాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కీటకనాశక ద్రావణాలు, దోమతెరలు ఉపయోగించాలి. జ్వరం, వాంతులు, మూర్ఛలు కనిపిస్తే వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి.

### ఎందుకు అప్రమత్తంగా ఉండాలి?
చండీపుర వైరస్ చాలా అరుదుగా కనిపించినా, ఒకసారి సోకితే వేగంగా తీవ్ర స్థితికి చేరుకునే ప్రమాదం ఉంది. అందుకే పిల్లల్లో సాధారణ జ్వరంతో పాటు నాడీ సంబంధిత లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



**మొదటిపేజీ తరువాయి**
పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.
తీరప్రాంతాల్లోని దాదాపు 33 లక్షల మంది ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు పవన్ వివరించారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులకు స్పష్టం చేశారు. నిర్దేశిత వ్యవధిలోనే కీలక నిర్మాణాలను పూర్తి చేసి, ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. తీరప్రాంత ప్రజల తాగునీటి భద్రతను నిర్ధారించడంలో జల్ జీవన్ మిషన్ కీలక పాత్ర పోషిస్తోందని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొనియాడారు.

# జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్..

**మొదటిపేజీ తరువాయి**
లోక్‌సభలో ఇదివరకే ఆమోదం పొందిన ఈ బిల్లు, త్వరలోనే చట్టరూపం దాల్చనుంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు.తాజా సవరణల ప్రకారం, జనన లేదా మరణ ధ్రువీకరణ పత్రాలను ఆలస్యంగా నమోదు చేయాలంటే కఠిన నిబంధనలు వర్తిస్తాయి. ఘటన (పుట్టిన లేదా మరణించిన) జరిగిన ఏడాది తర్వాత (రెండేళ్ల లోపు) నమోదు చేయాల్సి వస్తే జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి ముందస్తు అనుమతి పొందడం తప్పనిసరి. ఒకవేళ రెండేళ్లు దాటిన పక్షంలో, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.ఈ సందర్భంగా మంత్రి నిత్యానంద రాయ్ మాట్లాడుతూ, జనన మరణాలను నిర్ణీత సమయంలోగా నమోదు చేయడాన్ని ప్రోత్సహించడంతో పాటు, తప్పుడు సమాచారం, అవకతవకలను అరికట్టడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3.5 లక్షల రిజిస్ట్రేషన్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, 2014లో 86.6 శాతంగా ఉన్న జననాల నమోదు 2024 నాటికి 99 శాతానికి పైగా చేరిందని ఆయన వివరించారు. అదేవిధంగా మరణాల నమోదు 72.5 శాతం నుంచి 99.4 శాతానికి పెరిగిందని మంత్రి వెల్లడించారు.బిల్లుపై జరిగిన చర్చలో భాగంగా బీజేపీ ఎంపీ దర్శన సింగ్ మాట్లాడుతూ, ఈ కొత్త సవరణలు వ్యవస్థను మరింత సరళంగా, పారదర్శకంగా మారుస్తాయని కొనియాడారు. అయితే, రెండేళ్ల తర్వాత జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించాలనే నిబంధనపై బీజేడీ ఎంపీ డాక్టర్ సంతృప్త్ మిశ్రా కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఇప్పటికే పనిభారంతో ఉన్న న్యాయస్థానాలపై మరింత ఒత్తిడి పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వైసీపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, అన్నాడీఎంకే సహా పలు పార్టీల సభ్యులు ఈ బిల్లుకు మద్దతు తెలిపారు.

# ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్

**మొదటిపేజీ తరువాయి**
సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించవద్దని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలు వినియోగిస్తున్న టీ-స్వాన్ నెట్‌వర్క్‌ను వచ్చే నెల రోజుల్లో పూర్తిగా టీ-్గ÷బైర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ-్గ÷బైర్ కనెక్టివిటీ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఇంటింటికీ ఇంటర్నెట్' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి గ్రామీణ ప్రాంతాల వరకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

# పెద్ద ఎత్తున కల్తీ మసాలాల తయారీ

**మొదటిపేజీ తరువాయి**
3 క్రిమినల్ కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు. సింథటిక్ రంగులు, క్లాత్ డైలు, టాల్కమ్ పౌడర్లు, ఇండస్ట్రియల్ కలర్స్, రైస్ బ్రాన్ ఆయిల్ నకిలీ మసాలాల్లో వినియోగించినట్టు గుర్తించామన్నారు. కల్తీ మసాలాల వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. కల్తీ ఆహార పదార్థాల కేసులపై త్వరలో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేస్తామని సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు
హైదరాబాద్ కల్తీ మసాలా తయారీముఠా కేసులో హైదరాబాద్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రకటించారు. ప్రమాదకర రసాయనాలతో టన్నుల మసాలా దినుసులను తెలుగు రాష్ట్రాలకు ఈ ముఠా సరఫరా చేస్తోందని తెలిపారు. సిట్ ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తు చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై హెచ్ -ఫాస్ట్ మెరుపు దాడులు చేసిందని సీపీ పేర్కొన్నారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ప్రజల సమాచారం ఆధారంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని చెప్పుకొచ్చారు. 25 టన్నులకుపైగా కల్తీ మసాలాలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. కల్తీ మసాలాల కేసుల్లో ముగ్గురిని అరెస్ట్ చేశామని అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు నమోదు అయ్యాయని వెల్లడించారు. వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు సహా పలు మసాలాల్లో కల్తీ చేసినట్లు గుర్తించామని తెలిపారు. ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ కలర్స్‌తో మసాలాలు తయారీ చేస్తున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్ వినియోగిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. మసాలాలకు మెరుపు కోసం హానికర రసాయనాలను వినియోగిస్తున్నారని తెలిపారు. రంగులు వేసి నాణ్యమైన మసాలాల మాదిరిగా విక్రయిస్తున్నారని చెప్పుకొచ్చారు. 89 టన్నులకుపైగా ముడి పదార్థాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్తీ మసాలాల నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపామని వెల్లడించారు. కల్తీ ఆహారం వల్ల కాలేయం, మూత్రపిండాలకు ముప్పు పొంచి ఉందని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మసాలాలతో క్యాన్సర్, అలర్జీలు, జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ-ఈం÷ ఏర్పడిన 140 రోజుల్లో 659 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామని అన్నారు. 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 246 టన్నుల కల్తీ ఆహారాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రజలు
అనుమానాస్పద ఆహారంపై వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# అగమ్య గోచరంగా ప్రభుత్వాసుపత్రులు

**మొదటిపేజీ తరువాయి**
గాలిలో దీపంలా మారడం శోచనీయమని తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా హరీశ్‌రావు పోస్టుపెట్టారు. గత రెండు నెలలుగా పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో ÷ఖ పరిధిలోని ఎంసీహెచ్, జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్సీ మొత్తంగా 184 ఆస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్పత్రుల పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైద్యుల హాజరు, ల్యాబ్ పరీక్షలు, మందుల లభ్యత తదితర అంశాలను పర్యవేక్షించే అధికార యంత్రాంగమే లేకుండా పోయిందని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. దీంతో ఒకవైపు వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ పాలనలో ప్రజలు సరైన వైద్య సేవలు అందక అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది వేతనాలు, సర్వీస్ సమస్యలు సహా ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ÷ఖని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయాలని తమ హయాంలో నిర్ణయించామని ప్రస్తావించారు. దాదాపు మూడేళ్లు గడుస్తున్నా సర్వీసు నిబంధనలు రూపొందించక పోవడం, లక్ష్యం కార్యరూపం దాల్చకపోవడం దురదృష్టకరమని హరీశ్‌రావు అన్నారు. దీంతో వైద్యులు, వైద్య సిబ్బంది తీవ్ర నిరాశకు గురవుతున్నారని చెప్పుకొచ్చారు. ఇదే విషయమై ఉద్యోగులు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా లాభం లేకుండా పోతుందని తెలిపారు. రో÷-లడెక్కి నిరసనలు తెలియచేస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడాలని డిమాండ్ చేశారు. వెంటనే డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు సంబంధించి వెంటనే కమిటీ వేసి సర్వీస్ నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించాలని, తక్షణమే పూర్తిస్థాయి అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

RNI - TELTEL/2023/87644

# తెలంగాణ వ్యాప్తంగా మేఘావృతమైన ఆకాశం - హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన

**హైదరాబాద్ :** నైరుతి రుతుపవనాలు కదులికలు చురుగ్గా ఉన్నాయి. వీటి ప్రభావంతో హైదరాబాద్‌లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అంతేకాకుండా ఎల్లో అలర్ట్? కూడా జారీ చేసింది. తెలంగాణ వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. క్యూములోనింబస్ మేఘాల ప్రభావంతో సోమవారం ఉత్తర తెలంగాణతో పాటు హైదరాబాద్‌లో కుండపోత వర్షం కురిసింది. కామారెడ్డిలో అత్యధికంగా 18.2 సెంటీమీటర్లు, వికారాబాద్, సంగారెడ్డి వంటి జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైనట్టు అధికారులు ప్రకటించారు. హైదరాబాద్‌లో సోమవారం సాయంత్రం తేలికపాటిగా మొదలైన వర్షం రాత్రికి ఉధృతంగా మారింది. గంటల తరబడి కురిసిన వానతో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. రహదారులపై భారీగా



నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అక్కడక్కడ ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైడ్రా, మున్సిపల్ సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో పంపింగ్ మోటార్లతో నీటిని తొలగించే పనులు కొనసాగించారు. ప్రమాదకర ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీ నగర్, మలక్‌పేట్, చంపాపేట్, చాదర్‌ఘాట్, అసెంబ్లీ, లక్డీ కా పూల్, ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బాచుపల్లి, నిజాంపేట్, కుత్బుల్లాపూర్‌లో కురిసిన వర్షానికి నీరు రోడ్లపైకి చేరడంతో జనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారు. ఈ వర్షంతో నగర జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మరోవైపు వాతావరణ శాఖ మరో 24 గంటల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. హైదరాబాద్‌తో పాటు మరో 16 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. నగరంలో గత రాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్లపై నీళ్లు చేరాయి. ఉదయం ప్రజ జీవనానికి ఏ విధంగా ఇబ్బంది ఉండకూడదని హైడ్రా అర్ధరాత్రి 12 గంటల సమయంలోనూ సేవలందించింది. నగరవ్యాప్తంగా వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో హైడ్రా ఐ=ఖీ, వీ=ు బృందాలు సేవలు అందించాయి. రహదారుల్లో నిలిచిన వరద నీటిని సాఫీగా డ్రైనేజీల్లోకి పంపేసింది. వర్షం ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని.., క్షేత్ర స్థాయిలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి హైడ్రా అధికారుల సూచనలు చేస్తూ సిబ్బందితో పని చేయించారు. అవసరమైన చోట వెనువెంటనే సహాయక చర్యలతో పరిస్థితులు చేయిదాటిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

## రోడ్లపై కేజీవీల్ ట్రాక్టర్ల రవాణా పై కఠిన చర్యలు



**ఎలిగేడు, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రోడ్లపై కేజీవీల్ ట్రాక్టర్లు తిరిగితే కఠిన చర్యలు తప్పవని ఎలిగేడు ఎస్సై మధుకర్ హెచ్చరించారు. మంగళవారం ఉదయం మండల కేంద్రంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు ఆర్అండ్‌బీ రోడ్డుపై నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ట్రాక్టర్‌ను గమనించి అదుపులోకి తీసుకున్నారు. టీఎస్ 22 ఈ 90001 నెంబరు గల కేజీవీల్ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ యాకన్నకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. "ఇకపై రహదారులపై ఇనుప చక్రాలు (కేజీవీల్స్)తో ట్రాక్టర్లు లేదా ఇతర వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు" అని ఎస్సై మధుకర్ స్పష్టం చేశారు.

## నర్సాపూర్‌లో ఉచిత క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు



**ఎలిగేడు, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నర్సాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఉచిత క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారిణి నిస్సి క్రిస్టిన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ పల్లెర్ల వెంకటేష్, కార్యదర్శి లలిత ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. గ్రామంలోని 14 సంవత్సరాలు పైబడిన వారందరికీ ఉచిత ఎక్స్‌రే పరీక్షలు చేయబడతాయని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## ప్రపంచ ఆదివాసి దినోత్సవ కరప్రతాలు ఆవిష్కరణ

**దమ్మపేట, ఆగస్టు 04 :** ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతుల మీదుగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఈ నెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసి దినోత్సవ కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర కోశాధికారి మాట్లాడుతూ ప్రతి గూడెంలో ఆదివాసి జెండా ఎగురవేయాలన్నారు. జాతి ఐక్యతను చాటాలని, తమ జాతి హక్కులను, చట్టాలను రక్షించడానికి బలమైన



ఉద్యమం నిర్మించే దిశగా యువత అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రపంచ ఆదివాసి దినోత్సవం రోజున ప్రతి ఒక్క ఆదివాసి జిల్లా ప్రధాన కేంద్రమైన కొత్తగూడెంలో నిర్వహించే భారీ సాంస్కృతిక ర్యాలీకి హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు తెల్లం రామారావు దొర, ఆదివాసి సంక్షేమ రాష్ట్ర నాయకుడు గడ్డం వెంకటేశ్వరరావు, ఆదివాసి యువ నాయకుడు కాకా రమేశ్ పాల్గొన్నారు.

## ఫ్యాబ్రిక్ డై, సింథటిక్ కలర్స్‌తో మసాలాల తయారీ

**హైదరాబాద్, ఆగస్టు 4 :** హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై ఆధ్వర్యంలో మెరుపు దాడులు చేశామని భాగ్యనగర సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ప్రజల సమాచారం ఆధారంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని చెప్పుకొచ్చారు. 25 టన్నులకుపైగా కల్తీ మసాలాలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. కల్తీ మసాలాల కేసుల్లో ముగ్గురిని అరెస్ట్ చేశామని అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు నమోదు అయ్యాయని వెల్లడించారు. వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు సహా పలు మసాలాల్లో కల్తీ చేసినట్లు గుర్తించామని తెలిపారు. ఆ మసాలాల్లో హానికర రసాయనాలు..ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ కలర్స్‌తో మసాలాల తయారీ చేస్తున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. టాల్కమ్ పౌడర్,



ఇండస్ట్రీయల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్ వినియోగిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. మసాలాలకు మెరుపు కోసం హానికర రసాయనాలను వినియోగిస్తున్నారని తెలిపారు. రంగులు వేసి నాణ్యమైన మసాలాల మాదిరిగా విక్రయిస్తున్నారని చెప్పుకొచ్చారు. 89 టన్నులకుపైగా ముడి పదార్థాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్తీ మసాలాల నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపామని వెల్లడించారు. ఈ మసాలాలతో కేన్సర్..కల్తీ ఆహారం వల్ల కాలేయం, మూత్రపిండాలకు ముప్పు పొంచి ఉందని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మసాలాలతో కేన్సర్, అలర్జీలు, జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదమని తెలిపారు. ఎ- ఖీూు ఏర్పడిన 140 రోజుల్లో 659 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామని అన్నారు. 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 246 టన్నుల కల్తీ ఆహారం స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రజలు అనుమానాస్పద ఆహారంపై వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

## ఇక హద్దులు పక్కాగా..గట్టు పంచాయతీలకు తెర

**జమ్మికుంట(కరీంనగర్):** నిజాం కాలంలో చేసిన సర్వేను ప్రమాణికంగా తీసు కుని ఇప్పటి వరకు భూముల సరిహద్దులు నిర్ణయిస్తున్నారు. సాధారణంగా ప్రతి 30ఏళ్లకు ఒకసారి భూ సర్వే చేయాల్సి ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు దానిని నిర్లక్ష్యం చేశాయి. దీంతో ప్రభుత్వ భూములు సైతం కబ్జా కావడంతోపాటు సరిహద్దు వివాదాలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు భూభారతి రీసర్వే ప్రక్రియను అత్యాధునికమైన డీజీపీఎస్ (డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషన్ సిస్టమ్) విధానం ద్వారా నిర్వహిస్తోంది. ఈ సర్వేకు భూ భారతి పోర్టల్ ద్వారా జీపీఎస్ వెరిఫైడ్ ల్యాండ్ మ్యాపింగ్ సాంకే తికతను ఉపయోగిస్తున్నారు. ఉపగ్రహ ఆధారిత అక్షాంశాలు, రేఖాంశాలు ద్వారా భూమి సరిహద్దులను డిజిటల్‌గా లాక్ చేస్తారు. దీనివల్ల ఒకరి భూమిని మరొకరు




క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉండదు. గ్రామాల్లో ప్రధాన సమస్యలైన గెట్లు జరపడం, ఒకరి భూమిని మరొకరు ఆక్రమించుకోవడం, ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, సంక్షేమ పథకాలను దొడ్డిదారిన పొందుతున్నటువంటి వారికి ఈ భూ భారతి చట్టం ద్వారా చెక్ పడనుంది. సాగు భూ ముల రిజిస్ట్రేషన్లలో సరిహద్దు మ్యాప్‌లను అను సంధానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త నిబంధన లను అమల్లోకి తెచ్చింది. ప్రతి పట్టాదారుకు భూధార్ అనే పేరుతో ఒక నంబర్‌ను కేటాయి ంచి, వారికి సంబంధించిన పూర్తి భూమి వివరాలు అందు లో పొందుప రుచుతారు. క్యూ ఆర్ కోడ్‌ను కేటాయించి, ఎల్‌పీఎమ్ విధానం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్) ద్వారా రైతులకు సంబంధించిన పూర్తి వివరాలను క్రోడీకరించ నున్నారు. రెవెన్యూ రికార్డులు, క్షేత్రస్థాయి సరిహ ద్దులు ఒకేలా ఉండేలా చూసి వివాద రహిత భూ మిగా గుర్తిసారు. రాష్ట్రవ్యాప్తంగా రీ-సర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూమికి ఒక ప్రత్యేక భూధార్ నంబర్‌ను కేటాయిస్తున్నారు. మనిషికి ఆధార్ కార్డు ఎలాగో, భూమికి ఈ భూధార్ కార్డు అలా పనిచేస్తుంది. ఇందులో భూమి విస్తీర్ణం, సరిహద్దుల మ్యాప్ డిజిటల్‌గా లింక్ అయి ఉంటాయి. ప్రతీ మండలంలోని ఒక్కో గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంచుకున్న ప్రభుత్వం.. ఆయా గ్రామాల్లో భూభారతి ద్వారా భూముల సర్వేను చేస్తోంది. జిల్లాలోని జమ్మికుంట మండలంలో విలాసాగర్ గ్రామం ప్రభుత్వం ఎంచుకున్న పైలట్ ప్రాజెక్ట్‌ల్లో ఒకటి. విలాసాగర్‌లో మొత్తం 386 సర్వే నెంబర్లు ఉండగా, అందులో 1,423 ఎకరాల 24 గుంటల భూమి ఉంది. 15 సర్వే నంబర్లలో 139 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 371 సర్వే నంబర్లలో 492 మంది రైతులకు సంబంధించిన 951 ఎకరాల భూమి ఉంది. మిగిలిన 333 ఎకరాల భూమి మానేరు వాగులో భాగంగా అధికారులు తేల్చారు.

## నీ సూసైడ్ నోట్ ఆధారంగానే కాంగ్రెస్ సర్కార్‌పై పోరాటం

**హైదరాబాద్ :** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గం లో ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని ఆత్మహత్యాయత్నం చేసిన నిరుద్యోగి వేణు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిసి ందే. ఈ మేరకు వేణును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్ ద్వారా పరా మర్శించారు. బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ఆత్మహత్యాయత్నం చేసిన వేణుని ఆసుపత్రిలో పరామర్శించి కేటీఆర్ చేత ఫోన్ మాట్లాడించగా. వేణుకు ధైర్యం చెప్పిన కేటీఆ ర్ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం లేదని, నోటిఫికేషన్ల కోసమే ఆత్మహత్యాయత్నం చేసుకుంటే.. తాను వ్యక్తిగత ప్రేమ వ్యవహారంతో ఆత్మహత్యాయత్నం చేసినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం తనపై దుష్ప్రచారం చేస్తోందని వేణు కేటీఆర్‌తో ఆవేదన



పంచుకున్నాడు. మా అమ్మ మానసిక వికలాంగురాలు. తనకు సొంత ఇల్లు లేనప్పటికీ కక్ష పూరితంగానే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వ లేదన్నాడు. మా వేణు రాసింది సూసైడ్ నోట్ కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఛార్జ్ షీట్ అని ప్రెస్ మీట్ పెట్టి గట్టిగా మాట్లాడటం జరిగింది. దాని ఆధారంగానే కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తామని, రాగానే దాని ఆధారంగానే న్యాయం చేస్తామని కేటీఆర్ వేణుకు భరోసానిచ్చారు.




## చేనేత మగ్గంతో అద్భుతం - 170 నిమిషాల్లోనే అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీర తయారీ

**రాజన్న సిరిసిల్ల జిల్లా :** రంగురంగుల దారాలను మగ్గంపై పేర్చి, తమ ఊపిరిని నూలు పోగులుగా మలచి, అద్భుతమైన వస్త్రాలను సృష్టించే వారే చేనేత కార్మికులు. చేనేత అంటే కేవలం ఒక వృత్తి కాదు. తెలం గాణ సంస్కృతి, వారసత్వానికి, కళా వైభవానికి సజీవ రూపం. అలాంటి గొప్ప కళ గురించి ఇప్పుడు విస్తృతంగా మాట్లాడుకునే విధంగా చేశాడు ఈ నేతన్న. అంతే కాకుండా చేనేత వృత్తి గురించి నిరంతరం ప్రపంచానికి చాటి చేప్పే ప్రయత్నం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఎంత కళా నైపుణ్యమున్న చేనేత కార్మికుడైనా పట్టు చీరను నేయాలంటే కనీసంగా ఒక్కరోజు పడుతుంది. అలాంటిది కేవలం 170 నిమిషా ల్లో చీరను నేసి అగ్గిపెట్టెలో పట్టే విధంగా రికార్డు నెలకొల్పారు రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు వెల్ది హరిప్రసాద్. ఆగస్టు 7న అంతర్జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సిరిసిల్ల నేతన్నల కళా నైపుణ్యం, వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఈ సాహసం చేశారు. అనుకున్న సమయం కన్నా ముందుగానే చీరను నేసి, అందరి నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు



హరిప్రసాద్. చేనేత చరిత్రలో మైలురాయి : ఆగస్టు 3న ఉదయం 9:30 గంటలకు పట్టుచీర నేతను హరిప్రసాద్ తన యంత్రంలో పెట్టి ప్రారంభించాడు. 5.5 మీటర్ల పొడవు, 45 అంగుళాల వెడల్పు, 175 గ్రాముల బరువున్న చీరను 170 నిమిషాల్లో అంటే సరిగ్గా 12:20కి వేగంగా పూర్తి చేశాడు. ప్రత్యేక నైపుణ్యంతో ఆ చీరను మడిచి, ప్రముఖుల సమక్షంలో సాధారణ అగ్గిపెట్టెలో పెట్టి తన ప్రతిభను ప్రదర్శించారు. ఈ చీర తయారీలో సుమారు 10,500 వెఫ్ట్ పోగులు, 1,500 వార్ప్ పోగులు ఏమాత్రం తీసిపోకుండా సంప్రదాయ చేనేత మగ్గంపైనే ఈ అరుదైన ఘనత సాధించడం చేనేత చరిత్రలో చర్చనీయాంశంగా మారింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్?లో నమోదు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ రికార్డును సాధించడం కోసం హరిప్రసాద్ ఏడాది కాలంగా రోజుకు 3 నుంచి 4 గంటల పాటు సాధన చేసినట్లు తెలిపారు. "నేను ఒక సంవత్సర కాలంగా కష్టపడ్డాను. రోజుకు 3 గంటల చొప్పున నేసి చీరల తయారీ చేసేవాడిని. మరమగ్గంతో పోటీ పడాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేయడం సంతోషం గా ఉంది. ఈ చీర 10,500 వెఫ్ట్ పోగులు, 1,500 వార్ప్ పోగులతో 175 గ్రాముల బరువు ఉంటుంది. గతంలో +-20 లోగో నేసి ప్రధాని మోదీ గారికి పంపాం. 95వ మన్ కీ బాత్ కార్యక్రమంలో నా గురించి, మా సిరిసిల్ల పట్టణం గురించి మోదీ ప్రత్యేకంగా మాట్లాడా రు." - వెల్ది హరిప్రసాద్, చీరను నేసిన కార్మికు డుఒక చీరను ఎంత నైపుణ్యం ఉన్న నేత కార్మికుడు నేసినా కనీసం ఒక రోజు పడుతుంది. మర మగ్గం (ఆధునిక యంత్రం) మీద నేసినా అంతకన్నా ఎక్కువ సమయమే పడుతుంది. అలాంటిది మరమగ్గంతో పోటీ పడి, ఈ ఘనతను సాధించానని చెబుతున్నాడు హరి ప్రసాద్. శరీరంలోని అన్ని అవయవాలను ఏకీకృతం చేస్తే తప్ప ఇంత తక్కువ సమయంలో చీర నేయడం సాధ్యం కాదని చెబుతున్నాడు.

బుధవారం, ఆగస్టు 05, 2026 | నీలగిరి ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రిక | RNI - TELTEL/2023/87644



## ప్రతి దేవాలయానికి కలశాల పంపిణీ



ఖానాపూర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రజల కోరికలు నెరవేరాలని ఆకాంక్షిస్తూ శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి ఆదేశాల మేరకు 1008 కలశాలను ప్రతి దేవాలయానికి పంపించారు. ఈ మహత్తర కార్యక్రమాన్ని చక్రపాణి నరసింహ మూర్తి, డాక్టర్ విజయ కుమార్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మి వేంకటేశ్వర దేవస్థానం, పద్మావతి నగర్‌లో నిర్వహించారు. భక్తులు తమ కోరికలు నెరవేరాలని కోరుతూ శ్రీరామ కలశంలో బియ్యం పోసి ప్రార్థనలు చేశారు. రామ అను గ్రహం కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అడ్డగట్ల రాజన్న, ప్రధాన కార్యదర్శి నిమ్మల రమేష్, సభ్యులు రామ్ భీమన్న, లింగాల రాములు, తుమ్మలపల్లి లక్ష్మణ్, లింగాల లక్ష్మణ్, తోట సత్యం, మంత్రి రాజ్యం, సురేష్, దేవేందర్ చైతన్యతో పాటు పెద్ద సం ఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కలశాల కార్యక్రమం ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలిచింది.

## వర్షం లేక నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి ఐక్య రైతు సంఘం



ఖానాపూర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలో వర్షాలు లేకపోవడంతో విత్తిన విత్తనాలు మొలకెత్తక రైతులు నష్టపోయారని, వారికి నష్టపరిహారం అందించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు నందిరామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం తహసిల్దార్‌కు మెమోరాండం సమర్పించిన ఆయన మాట్లాడుతూ, నష్టపోయిన గ్రామాల్లో సర్వే చేసి రైతులకు పరిహారం ఇవ్వాలని, పంటల భీమా అమలు చేయకపోవడం వల్ల రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పోడు సాగులో ట్రాక్టర్ల వాడకంపై ఫారెస్టు అధికారులు చేస్తున్న హెచ్చరికలు సరికాదని, మారిన పరిస్థితుల్లో ట్రాక్టర్లతో సాగు అనివార్యమని, వెంటనే అనుమతి ఇవ్వాలని కోరారు. రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడ్డగట్ల కంతార్, అందాల శంకర్, జక్కుల రాజన్న, మండల నాయకులు పాల్గొన్నారు.

## పర్యావరణ సమతుల్యత కోసం మొక్కలు నాటాలి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



ఖానాపూర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఖానాపూర్ పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత కోసం, సకాలంలో వర్షాలు కురవాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్, వైస్ చైర్మన్ ముహమ్మద్ షోయబ్ హుస్సేన్, కౌన్సిలర్లు బొప్పరపు సత్యవతి, తొడసాం ఇందిరా, కమిషనర్ సుందర్ సింగ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డ్రై డే నిర్వహణ



ఖానాపూర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఖానాపూర్ శాసనసభ్యుడు వెడ్మా బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని 7వ వార్డులో పెంబి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రెండో రౌండ్ ఫీవర్ సర్వే, డ్రై డే నిర్వహించారు. పద్మావతి నగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నిమ్మల రమేష్ పాల్గొని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని, ఎలాంటి సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగిలి శంకర్, వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు అడ్డగట్ల రాజన్న, రామ్ భీమన్న, లింగాల రాములు, ఉషకోల సుధాకర్, లింగాల లక్ష్మణ్, 5వ వార్డు ఇంచార్జ్ మేస సతీష్, ఆరోగ్య సిబ్బంది మీరాబాయి, పార్వతి, లావణ్య, ఆశా కార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యల పై ధర్నాకు పిలుపు



ఖానాపూర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రభుత్వం గత మూడు నెలలుగా ఎన్‌ఈహెచ్‌ఎస్ ప్రీమియం వసూలు చేస్తున్నప్పటికీ నగదు రహిత వైద్యం అందించడం లేదని, మూడు సంవత్సరాలు గడిచినా పీఆర్‌సీ రిపోర్టు వెలువడలేదని, ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని టీజీపీ జేఏసీ మండల అధ్యక్షుడు సాదు లింగమూర్తి, ప్రధాన కార్యదర్శి కే. నరసయ్యలు తెలిపారు. ప్రభుత్వం మాటలతోనే కాలం గడుపుతోందని, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించకపోవడంతో విసిగిపోయిన టీజీపీ జేఏసీ ఆగస్టు 7న ఛలో హైదరాబాద్, ఇందిరాపార్క్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు వారు ప్రకటించారు. పెన్షనర్లకు హెల్త్ కార్డులు విడుదల చేసి నగదు రహిత చికిత్సలు అందించాలి, కొత్త పీఆర్‌సీని ప్రకటించి 2023 జూలై 1 నుండి అమలు చేయాలి, రిటైరైన పెన్షనర్ల బకాయిలన్నీ చెల్లించాలి, ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలి, కమ్యూటేషన్ 11 సంవత్సరాల 3 నెలలకు మాత్రమే పరిమితం చేయాలి, 20 సంవత్సరాల సేవకే పూర్తి పెన్షన్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. పెన్షనర్లందరూ అధిక సంఖ్యలో ధర్నాకు హాజరై విజయవంతం చేయాలని సంఘం విజ్ఞప్తి చేసింది.

## సామాజిక న్యాయం మా విధానం తెలంగాణ రక్షణ సేన



కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన అసెంబ్లీ సమావేశం జరిగింది. నియోజకవర్గ ఇంచార్జ్ అంకం శివరాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్ర అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో ఆగస్టు 6న హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగే సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం పార్టీ నినాదం కాదు, విధానం అని కవిత ప్రకటించారని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలని చెబుతుందని, కానీ ఇప్పటి వరకు పాలకుల వివక్ష కారణంగా అనేక వర్గాలు వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నాయని అన్నారు. సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా విద్య, ఉపాధి, భూమి, ఆరోగ్యం వంటి రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడమే నిజమైన సామాజిక న్యాయం అని ఆయన స్పష్టం చేశారు. ఈ సభలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు, సంక్షేమం కల్పించే విధానాన్ని కవిత ప్రకటించనున్నారని తెలిపారు. కరీంనగర్ నియోజకవర్గం నుండి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో లింగంపల్లి నాగరాజ్, చెన్నమల్ల చైతన్య, మేకల తిరుపతి, శ్రీరాముల రమేష్, కుతాడి శ్రీనివాస్, గాలి పెల్లి రత్నాకర్, రంగరవేణి లక్ష్మణ్, యండి రాజీ, పూసల పవన్, గర్షకుర్తి విద్యాసాగర్, భాసవేణి రాజేందర్, ఎండి హుస్సేన్, ఉమార్, మడిపల్లి వినీత్, పూసాల రణధీర్, నూతి సాయిచరణ్, పిన్నింటి సంగీత రెడ్డి, జంగా అపర్ణ, కృష్ణవేణి, కొరిమి పద్మ, పల్లె శారద తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్రూమ్ ఇండ్లలో మౌలిక వసతులు కల్పించాకే పంపిణీ చేయాలి సునీల్ రావు



కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ చింతకుంటలో గత పదేళ్లుగా నిర్మాణంలో ఉన్న 668 డబుల్ బెడ్రూమ్ ఇండ్లను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, లిఫ్టులు వంటి మౌలిక వసతులు పూర్తిగా కల్పించిన తర్వాతే ఇండ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ. 20--25 కోట్ల నిధులను విడుదల చేయాలని కోరారు. ఆరు అంతస్తుల భవనాల్లో ఒక్కో బ్లాక్‌కు రెండు లిఫ్టులు ఏర్పాటు చేయాలని, పేద ప్రజలు నిర్వహణ ఖర్చులు భరించలేరని కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. సొంత స్థలం లేని వారికి నగర సమీపంలోని ప్రభుత్వ స్థలాల్లో బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి ఈ ఏడాదిలోనే ఇండ్లను అందజేయాలని ఆయన అన్నారు. పూర్తిస్థాయి వసతులు కల్పించకుండా ఇండ్లు కేటాయిస్తే లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని సునీల్ రావు స్పష్టం చేశారు.

## సంకల్ప సభ విజయవంతం చేయాలని టీఆర్ఎస్ పిలుపు



పెద్దపల్లి, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): హైదరాబాద్ సరూర్‌నగర్‌లో ఆగస్టు 6న కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో జరగనున్న సంకల్ప సభ -- సామాజిక న్యాయ తెలంగాణ సాధన సభను విజయవంతం చేయాలని టీఆర్ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి సలేంద్ర కొమురయ్య యాదవ్ పిలుపునిచ్చారు. ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, బడుగు--బలహీన వర్గాల సామాజిక, రాజకీయ సాధికారతే సభ ప్రధాన లక్ష్యమని తెలిపారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీల ఐక్యతకు ఈ సభ వేదిక అవుతుందని, పాంచజన్యం మేనిఫెస్టోలో పేద విద్యార్థులకు ఉచిత విద్య, నిరుద్యోగులకు స్వయం ఉపాధి రుణాలు, రైతులకు ప్రత్యేక కౌంటర్లు, వెనుకబడిన వర్గాలకు ఉచిత వైద్య సేవలు వంటి అంశాలు ఉన్నాయని వివరించారు. పెద్దపల్లి నియోజకవర్గం నుంచి 300 మంది కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు సభలో పాల్గొననున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిరవేణి స్వప్న, గడ్డం లక్ష్మి, బొంగోని శంకరయ్య, ఉత్సం శ్రీనివాస్, కల్వల తిరుపతి, హన్మండ్లు, గంధం శంకర్, రవీందర్, మహేష్ గౌడ్, ఆనంద్, పల్లె శ్రీనివాస్, కిట్టు, సాగర్, కమలాకర్, సది, కనుకయ్య, గట్టయ్య పటేల్, స్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 50వ డివిజన్ మార్కండేయ కాలనీ--4 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ అలేఖ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గర్భిణీలకు సంప్రదాయబద్ధంగా సీమంతం, చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది, తల్లులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అదే విధంగా గన్నేరువరం మండలంలోని మైలారం గ్రామంలో కూడా తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. సర్పంచ్ గాలిపెల్లి పోశవ్వ మాట్లాడుతూ, శిశువు జననం తర్వాత గంటలోపే తల్లిపాలు అందించాలని, మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలనే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు శిశువుల్లో రోగనిరోధక శక్తి పెంచి శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో బాలింతలు, పిల్ల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ముత్యాల రజనీ--రమణారెడ్డి దంపతులు తల్లుల ఆరోగ్యానికి ఉపయోగకరమైన ఆర్గానిక్ మునగాకు పొడిని పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను విజయవంతం చేయాలి గంగాడి కృష్ణారెడ్డి



కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆగస్టు 15న జరగబోయే 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు, తిరంగా యాత్రలను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో మండల అధ్యక్షులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆగస్టు 11 నుంచి 14 వరకు నియోజకవర్గాల్లో తిరంగా యాత్రలు నిర్వహించాలని, ఆగస్టు 13 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని సూచించారు. మహాపురుషుల విగ్రహాలు, స్వాతంత్ర్య సమరయోధుల స్మారక చిహ్నాల వద్ద ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని, ఆగస్టు 14న దేశ విభజన దారుణాలను గుర్తుచేసే ఎగ్జిబిషన్లు, హాల్ మీటింగ్‌లు నిర్వహించాలని తెలిపారు. దేశ సరిహద్దులను కాపాడిన అమరవీరుల కుటుంబాలను, స్వాతంత్ర్య సమరయోధులను బీజేపీ నాయకులు స్వయంగా కలిసి గౌరవించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమాలను ప్రతి పౌరుడిని దేశభక్తితో అనుసంధానించే సామాజిక ఉద్యమంగా మార్చాలనే ఉద్దేశంతో పార్టీ జాతీయ నాయకత్వం ప్రతి ఏటా నిర్వహిస్తుందని గంగాడి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగోండ నాగేశ్వర్ రెడ్డి, తిరంగా అభియాన్ కన్వీనర్ సాయిని మల్లేశం, గుజ్జ శ్రీనివాస్, నేరెళ్ల ప్రవీణ్ రెడ్డి, రాజు అడిచెర్ల, బత్తుల లక్ష్మీనారాయణ, సంఘ నరేష్, ఆకుల రాజేందర్ జోన్, మోతె గంగారెడ్డి, మండల అధ్యక్షులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆగస్టు 10న జైలు భరో విజయవంతం చేయాలి



**నిడమానూరు, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల జాతీయ కమిటీల పిలుపు మేరకు ఈనెల 10వ తేదీన జైలు భరో కార్యక్రమం నిర్వహించనున్నట్లు నాయకులు ప్రకటించారు. నిడమానూరు మండల కేంద్రంలో మంగళవారం కరపత్రం ఆవిష్కరించి, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి కోటేష్, సిఐటియు మండల కన్వీనర్ కోమండ్ల గురువయ్య మాట్లాడుతూ, "మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు, రైతులు, పేదలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కార్పొరేట్ శక్తులకు తొత్తులుగా మారి దేశ సంపదను లూటీ చేస్తున్నారు" అని విమర్శించారు.వారు పేర్కొన్నదేమిటంటే, కార్మికులు ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న హక్కులను లేబర్ కోడ్ల ద్వారా కాలరాస్తూ, ఎనిమిది గంటల పని విధానాన్ని పెంచి, కనీస వేతనాలు, సమ్మె హక్కులను తొలగించడం అన్యాయం. రైతులకు గిట్టుబాటు ధర, సరైన మార్కెట్ సౌకర్యం, నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు అందించాల్సిన బాధ్యతను విస్మరించి, విద్యుత్ సవరణ చట్టం, విత్తన సవరణ చట్టం, వ్యవసాయ నల్ల చట్టాలు తీసుకువచ్చి రైతులను కూలీ లుగా మార్చే కుట్ర జరుగుతోందని వారు ఆరోపి ంచారు.దేశవ్యాప్తంగా మరోసారి రైతులు మోడీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధమవ ుతున్నారని, ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చి పేదల జీవనో పాధిని దెబ్బతీస్తున్నారని వారు పేర్కొన్నారు. "దేశవ్యాప్తంగా జైలు భరో కార్యక్రమం జరుగుతుంది. అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలి" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆకారపు నరేష్, రైతు సంఘం మండల అధ్యక్షులు నడ్డి నాగరాజు, డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు వెంపటి మహేష్, మల్లికంటి చంద్రశేఖర్, వ్యాకాస మండల అధ్యక్షులు కుంచెం శేఖర్, సిఐటియు నాయకులు వింజమూరి శివ, ముత్యాల కేశవులు, కోదండ చరణ్ రాజ్, దొడ్డ కోటేష్, శ్యామల రాజేష్, వింజమూరు పుల్లయ్య, కొనాలపురి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్, హనుమకొండ బస్టాండ్లలో ఆకస్మిక తనిఖీలు చేసిన ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి



**వరంగల్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి మంగళవారం వరంగల్, హనుమకొండ ప్రధాన బస్టాండ్లు, హనుమకొండ డిపోలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులకు అందుతున్న సేవలు, డిపో నిర్వహణ, మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "వరంగల్ నగర ప్రజా రవాణాను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ పీఎం ఈ- బస్ సేవా పథకం కింద మరో 100 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నాం. ప్రస్తుతం వరంగల్ రీజియన్‌లో 112 ఎలక్ట్రిక్ బస్సులు విజయవంతంగా నడుస్తున్నాయి" అని వెల్లడించారు.బస్టాండ్లలో పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మహిళా ప్రయాణికుల భద్రత, వెయిటింగ్ హాళ్ల నిర్వహణ, బస్సుల సమయపాలనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రీజినల్ మేనేజర్, డిపో మేనేజర్లు, డ్రైవర్లు, కండక్టర్లతో సమావేశమై బస్సు రూట్లు, ఆక్యుపెన్సీ నిష్పత్తి, ఉద్యోగుల సమస్యలపై సమీక్ష నిర్వహించారు."ఆర్టీసీపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సురక్షితమైన, నాణ్యమైన ప్రయాణాన్ని అందించడమే సంస్థ ప్రధాన ధ్యేయం. ప్రయాణికులకు సేవలందించడంలో ఎలాంటి అలసత్వాన్ని సహించం. ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి" అని ఎండీ నాగిరెడ్డి స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ 9 వేలకుపైగా బస్సుల ద్వారా సుమారు 60 లక్షల మంది ప్రయాణికులకు ఆర్టీసీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో వరంగల్ ఉమ్మడి జిల్లాలో ప్రజా రవాణా సేవలను మరింత ఆధు నీకరించి, ప్రయాణికులకు సురక్షితమైన, వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. రాజశేఖర్, చీఫ్ సివిల్ ఇంజినీర్ కవిత, వరంగల్ రీజినల్ మేనే జర్ భవానీ ప్రసాద్తో పాటు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బోడుప్పల్లో విజిబుల్ పోలీస్ అవగాహన కార్యక్రమం



**బోడుప్పల్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బోడుప్పల్ సర్కిల్-- 10 పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల దగ్గర విజిబుల్ పోలిసింగ్ అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడిపల్లి సీఐ జాలందర్ రెడ్డి హాజరై కాలనీవాసులకు పలు సూచనలు చేశారు.సీఐ మాట్లాడుతూ, "బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నేరం. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. ఎవరైనా మత్తు పదార్థాలు సేవిస్తున్నారని తెలిసిన వెంటనే కంట్రోల్ రూమ్ 100కు సమాచారం ఇవ్వాలి" అని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులిద్దరూ శిక్ష అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు.ప్రజలు నివసించే ఇండ్ల మధ్యలో ఆటలు ఆడకుండా, ప్లే గ్రౌండ్లలో మాత్రమే ఆడాలని సూచించారు. చదువుకోవాలనుకునే పిల్లలను గుర్తించి తెలియజేస్తే ప్రభుత్వం ఉచితంగా గురుకుల పాఠశాలల్లో చదివిస్తుందని తెలిపారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ముఖ్యంగా అమ్మాయిలు సోషల్ మీడియా వేదికల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. "ప్రజల సహకారం లేకుండా పోలీస్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయదు" అని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ అసోసియేషన్ అధ్యక్షుడు చిప్పల శ్రీధర్ మాట్లాడుతూ, "రాత్రి సమయంలో కాలనీలో పోలీస్ పెట్రోలింగ్ మొబైల్ వ్యాన్ తిరగాలని గతంలో వినతిపత్రాలు ఇచ్చాం" అని పేర్కొన్నారు. దీనికి స్పందించిన సీఐ జాలందర్ రెడ్డి, "ఈరోజు నుండే మీ కాలనీలో మొబైల్ పెట్రోలింగ్ ప్రారంభమవుతుంది" అని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మేడిపల్లి పోలీస్ సిబ్బంది, సెక్టార్ ఎస్సై యకాయ, అడ్మిన్ ఎస్సై నర్సింగ్ రావు, కానిస్టేబుల్ నటరాజ్, డివిజన్ అధ్యక్షులు గోపు రాములు, యూత్ అధ్యక్షులు గడ్డి రమేష్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తుక్కోజీ అమరేందర్, కోశాధికారి రాజగోపాల్ నాయుడు, గౌరవ అధ్యక్షులు అన్నందాసు బిక్షపతి, సలహాదారులు గుండ్ల కుమారస్వామి, దొండపాటి సత్యనారాయణ, ఇంచార్జ్ గోరిగే సంతోష్, ఇదుల వెంకటేష్, కిల్లరి అశోక్, పల్లె గణేష్, నాగేంద్ర చౌదరి, అజీజ్ బాయ్, మహిళలు, కాలనీవాసులు, యువకులు పాల్గొన్నారు.

# చిన్నారుల ఆరోగ్యానికి బాలామృతం వరం

**- పోషకాహార లోపం నివారణకు ప్రతి కుటుంబం సహకరించాలి**
**- మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్**



**ఆమనగల్లు, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చిన్నారుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు పోషకాహారం అత్యంత కీలకమని, బాలామృతం వంటి పోషకాహార కార్యక్రమాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్ మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్ అన్నారు. మంగళవారం ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలామృత పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిరేఖతో కలిసి చిన్నారులకు బాలామృతం అందించి తినిపించారు. ఈ సందర్భంగా చైర్మన్ పత్యనాయక్ మాట్లాడుతూ.. చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి సమతుల్య పోషకాహారం అవసరమని తెలిపారు. బాలామృతం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పోషకాహార పథకాలను ప్రతి అర్హ కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిరేఖ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం, ఆరోగ్య పరీక్షలు, ఎదుగుదల పర్యవేక్షణ వంటి సేవలను నిరంతరం అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆమనగల్ ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం చిన్నారులకు బాలామృతం పంపిణీ చేసి పోషకాహారంపై అవగాహన కల్పించారు.

# ఎఫ్ఏఓగా బాధ్యతలు స్వీకరించిన సిద్ధ పద్మ



**ఖానాపూర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిర్మల్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం ఎఫ్ఏఓగా బాధ్యతలు స్వీకరించిన నిర్మల్ మండల విద్యాధికారి సిద్ధ పద్మను ఎస్టీయూ నిర్మల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జె. లక్ష్మణ్, నాయకులు డి. లక్ష్మీనారాయణ, మఠం పరమేశ్వర్, బి. రమణ, డిఈఓ కార్యాలయం సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

# తప్పిపోయిన మహిళను గుర్తించిన పోలీసులు



**కరీంనగర్ రూరల్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉత్తరాఖండ్‌కు చెందిన రూపా రాథోర్ అనే మహిళను కరీంనగర్ రూరల్ పోలీసులు భద్రంగా గుర్తించారు. సోమవారం రాత్రి ఇరుకుల్ల గ్రామ శివారులో వంతెన సమీపంలో ఒంటరిగా నిలబడి ఉన్న ఆమెను పోలీసులు ఆధీనంలోకి తీసుకొని విచారించారు. కుటుంబ కలహాల కారణంగా భర్తతో గొడవపడి వారం రోజుల క్రితం ఉత్తరాఖండ్ నుంచి వివిధ వాహనాల్లో ప్రయాణించి కరీంనగర్‌కు చేరుకున్నట్లు ఆమె తెలిపింది. బస్సు టికెట్‌కు డబ్బులు లేకపోవడంతో ఇరుకుల్ల వద్ద దింపివేసినట్లు వివరించింది.పోలీసులు ఆమె కుటుంబ సభ్యులను సంప్రదించగా, ఉత్తరాఖండ్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు వచ్చి తీసుకెళ్తామని చెప్పడంతో, మహిళను శక్తి కేంద్రంలో సురక్షితంగా ఉంచినట్లు ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రెడ్డి తెలిపారు.

# మెగా యూత్ ఫోర్స్ ఉత్తర తెలంగాణ కన్వీనర్‌గా కపిల్ నియామకం



**కరీంనగర్ రూరల్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ మెగా అభిమానుల మెగా యూత్ ఫోర్స్ ఉత్తర తెలంగాణ రాష్ట్ర కన్వీనర్‌గా కరీంనగర్‌కు చెందిన మిడిదొడ్డి కపిల్ మాధవను నియమించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ చిరంజీవి బ్లడ్ బ్యాంకులో జరిగిన కార్యక్రమంలో మెగా యూత్ ఫోర్స్ గౌరవ అధ్యక్షురాలు కొణిదెల సుస్మిత ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.గత 20 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కపిల్ మాధవను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు సుస్మిత తెలిపారు. భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలను విస్తృ తంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఇకపై మెగా అభిమానుల కార్యక్రమాలు మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలోనే జరగాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ నియామకంపై స్పందించిన కపిల్ మాధవ తనపై నమ్మకం ఉంచిన మెగా కుటుంబ సభ్యులకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలి పారు. కార్యక్రమంలో అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రవణం స్వా మినాయుడు, జాతీయ కన్వీనర్ ఏడిద బాబీ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల వెంకటేశ్ పాల్గొన్నారు.

# యోగా ప్రసన్న లక్ష్మిని అభినందించిన మంత్రి పొన్నం



**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ట్రిపుల్ ఐటీ బాసరలో స్పోర్ట్స్ కోటా ద్వారా ప్రవేశం పొందిన ప్రసన్న లక్ష్మిని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు.కరీంనగర్ ప్రాం తీయ క్రీడా పాఠశాలలో మంత్రి ఆదేశాలతో సిఎస్ఆర్ నిధుల ద్వారా నిర్మించిన యోగా హాల్లో శిక్షణ పొందిన ఐదుగురు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనగా, వారిలో ప్రసన్న లక్ష్మి జాతీయ యోగా సర్టిఫికేట్‌తో బాసరలో సీటు పొందింది.ఈ సందర్భంగా మంత్రి ఆమెను శాలువాతో సత్కరించి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రసన్న లక్ష్మి స్ఫూర్తితో మరింత మంది విద్యార్థులు స్పోర్ట్స్ కోటా ద్వారా లబ్ధి పొందాలని ఆయన అన్నారు.కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ గుగులోతు అశోక్ కుమార్, యోగా కోచ్ వి. కిష్టయ్య, జిమ్నాస్టిక్ కోచ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్ఓఐడబ్ల్యూ వ్యవస్థాపక దినోత్సవం వేడుకలు



**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ వర్కర్స్ (ఎన్ఓఐడబ్ల్యూ) 58వ వ్యవస్థాపక దినోత్సవాన్ని కరీంనగర్ డివిజనల్ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు కె. నారాయణ పతాకాన్ని ఆవిష్కరిం చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ ఉపాధ్యక్షుడు కె. రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ, 1969 ఆగస్టు 4న ప్రారంభమైన ఈ సంస్థ బీమా ఉద్యోగుల హక్కులు, గౌరవం, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతూ వస్తోందని తెలిపారు. పోరాటాన్ని శక్తిగా, సేవను సంకల్పంగా భావిస్తూ యువతను కలుపుకొని సంస్థను మరింత బలోపేతం చేస్తోందని అన్నారు.డివిజన్ అధ్యక్షుడు కె. నారాయణ మాట్లాడుతూ, వ్యవస్థాపక నాయకులు, మాజీ పదాధికారులు, కార్యకర్తల త్యాగం వల్లే ఈ సంస్థ ఉన్నత స్థాయికి చేరిందని పేర్కొన్నారు. అడ్వైజర్ మాడిశెట్టి గోపాల్ మాట్లాడుతూ, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం సంఘటితంగా నిలవాలని, యువ కార్యకర్తలకు నాయకత్వ అవకాశాలు కల్పించాలని అన్నారు.కార్యక్రమంలో డివిజన్ సెక్రటరీ రవీంద్రాచారి, ఏ. రాంప్రసాద్, నరేందర్, నర్సయ్య, రమణ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు.

# బీజేపీ ప్రతినిధి సుధాకర్ పటేల్ హెచ్చరిక



**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జనసేన నాయకుడు భేతి మహేందర్ రెడ్డి తనపై వ్యక్తిగత దూషణలు చేస్తూ ప్రతిష్టకు భంగం కలిగించేలా మాట్లాడుతున్నారని, ఇలాంటి చర్యలు కొనసాగితే పరువు నష్టం దావా వేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటానని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఊగిలే సుధాకర్ పటేల్ హెచ్చరించారు. కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ, హిందుత్వవాదుల ఐక్యత కోసం దశాబ్దాలుగా పోరాడుతున్న వ్యక్తిని అని, కార్పొరేషన్ ఎన్నికల నుంచి మహేందర్ రెడ్డి తనపై కక్ష పెంచుకుని అసత్య ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. రాజకీయంగా ఎదగడం మంచిదే కానీ వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని సూచించారు.తన ప్రతిష్టకు భంగం కలిగించేలా మాట్లాడిన అంశాలను ఓపిక పట్టానని, ఇకపై కూడా ఇలాగే వ్యవహరిస్తే సాక్ష్యాధారాలతో కోర్టులో పరువు నష్టం దావా వేస్తానని సుధాకర్ పటేల్ స్పష్టం చేశారు.

RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
బుధవారం,
ఆగస్టు 05, 2026


# బిర్లా ఓపెన్ మైండ్స్‌లో స్కూల్ కౌన్సిల్ ఎన్నికల నిర్వహణ




**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ పాఠశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు ప్రజాస్వామ్య స్ఫూర్తితో నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగి ంచారు.ఎన్నికల్లో హెడ్ బాయ్‌గా అంతరీప్, హెడ్ గర్ల్‌గా తనుజా, డిసిప్లిన్ క్యాప్టెన్‌గా సహస్ర, కల్చరల్ క్యాప్టెన్‌గా శివ సాత్విక్, స్పోర్ట్స్ క్యాప్టెన్‌గా మను ఆశ్రిత్ విజేతలుగా ఎన్నికయ్యారు. విజేతలను అభినందించిన చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, నాయకత్వ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ప్రిన్సిపల్ మోనికా షా మాట్లాడుతూ, గెలుపు--ఓటములను సమానంగా స్వీకరిస్తూ ప్రజాస్వామ్య విలువలను అలవర్చుకోవాలని, కొత్తగా ఎన్నికైన నాయకులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజేతలకు అభినందనలు తెలిపారు.

# లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు




**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ ఎలక్ట్రిసిటీ గెస్ట్ హౌస్‌లో లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి చీఫ్ ఇంజనీర్ కె. మాధవరావు ముఖ్య అతిథిగా, డిస్ట్రిక్ట్ గవర్నర్ మోరా బద్రేశం విశిష్ట అతిథిగా హాజరయ్యారు. మాజీ గవర్నర్లు కొండ వేణుమూర్తి, చిదుర సురేష్, రెడ్ క్రాస్ చైర్మన్ కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.స్వచ్ఛంద రక్తదానం మానవతా సేవలో అత్యంత గొప్పదని ప్రముఖులు పేర్కొన్నారు. ఈ శిబిరంలో మొత్తం 40 యూనిట్ల రక్తం సేకరించబడింది. పర్యావరణ అవగాహనలో భాగంగా పాల్గొన్న వారికి వస్త్ర సంచులు పంపిణీ చేశారు.కార్యక్రమాన్ని డిస్ట్రిక్ట్ సెక్రటరీ సైనెని నరేందర్ నాయకత్వంలో, లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ సహకారంతో విజయవంతంగా నిర్వహించారు. విద్యుత్ శాఖ ఉద్యోగులు, లయన్స్ సభ్యులు, వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఈ నెల 6న మహిళా డిగ్రీ కళాశాలలో దోస్త్ స్పెషల్ డ్రైవ్



**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో దోస్త్ స్పెషల్ డ్రైవ్ ఫేజ్‌లో ఇంకా కొన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపల్ డి. వరలక్ష్మి తెలిపారు. ఆగస్టు 6 నుండి 11 వరకు రిజిస్ట్రేషన్లు జర గనున్నాయని, సీటు కేటాయింపు 14న జరుగుతుందని చెప్పారు. కేటాయించిన విద్యార్థినులు సెల్ఫ్ రిపోర్ట్ చేసిన తర్వాత ఈ నెల 17, 18 తేదీల్లో కళాశాలలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

# పురపాలక సంఘం ఆధ్వర్యంలో సఫాయి అప్నా బీమరీ బగావో కార్యక్రమం నిర్వహణ



**హుస్నాబాద్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ పట్టణంలోని 8వ వార్డులో పురపాలక సంఘం ఆధ్వర్యంలో సఫాయి అప్నా బీమరీ బగావో కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్ దండి లక్ష్మి నేతృత్వంలో కౌన్సిలర్లు ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత శు భ్రత పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీటిని తొలగించాలని సూచించారు. డయేరియా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షపు నీరు హార్వెస్టింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేసుకోవాలని, చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనానికి అందించాలని ప్రజలకు సూచించారు.కార్యక్రమంలో కౌన్సిలర్లు సంపత్, కాశబోయిన సరిత, శానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రవి కుమార్, జవాన్ ప్రభాకర్, శ్రీకాంత్, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయ కనెక్షన్లు వెంటనే రిలీజ్ చేయాలి చీఫ్ ఇంజనీర్ కే. మాధవరావు



**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ సర్కిల్ సమావేశ మందిరంలో మంగళవారం సర్కిల్ రివ్యూ మీటింగ్ జరిగింది. కార్పొరేట్ ఆఫీస్ వరంగల్ నుంచి వచ్చిన చీఫ్ ఇంజనీర్ కే. మాధవరావు, సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆర్. రవీందర్ ఆధ్వర్యంలో ఏఈలు, ఏడీఈలకు పలు ఆదేశాలు జారీ చేశారు.వ్యవసాయ కనెక్షన్లు వెంటనే రిలీజ్ చేయాలని, కొత్త మీటర్లను రెండు మూడు రోజుల్లో అమలు చేయాలని, ట్రాన్స్ఫార్మర్ పనులు పూర్తయిన వెంటనే వర్క్ ఆర్డర్ క్లోజ్ చేయాలని సూచించారు. నాన్ ఐఆర్డిఏ మీటర్లను త్వరగా మార్చాలని, ప్రజా బాట ప్రోగ్రామ్ ద్వారా సమస్యలను అదే రోజు పరిష్కరించాలని ఆదేశించారు. ట్రాన్స్ఫార్మర్ ఫెయిల్ అయితే డిపార్ట్మెంట్ వాహనంలో రవాణా చేయాలని, వినియోగదారుల ఫిర్యాదులను 1912 ద్వారా వెంటనే పరిష్కరించాలని సూచించారు. సమావేశానికి ముందు లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా, 40 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. తలసేమియా బాధితులకు ఈ రక్తం ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు మ్యాడం శివకాంత్, బట్టు వినోద్, సాయినేని నరేందర్, డిఈలు, ఏఈలు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి డీఎంహెచ్‌ఓ



**సుల్తానాబాద్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి పీహెచ్‌సీలో ఆశా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వై. పవిత్ర ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు పలు సూచనలు చేశారు. ప్రతి గర్భిణి ప్రసవం ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరిగేలా అవగాహన కల్పించాలని, ప్రారంభ దశలోనే నమోదు చేసి అవసరమైన టీకాలు, వైద్య పరీక్షలు సకాలంలో పూర్తి చేయాలని ఆమె సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని, ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించి దోమల నివారణ చర్యలు అమలు చేయాలని ఆదేశించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని డాక్టర్ పవిత్ర పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి వివేక్ వెంకటస్వామి



**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రుద్రంగి మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. 42 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ పనులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి భూమి పూజ చేశారు. అలాగే ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో రూ. 40 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాటాడుతూ, గ్రామీణ యువత పట్టణాలకు వెళ్లకుండా స్థానికంగానే నాణ్యమైన సాంకేతిక విద్య, శిక్షణ పొందే అవకాశం కలుగుతుందని, ఉపాధి సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వడం వల్ల క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రమాద బాధితులను పరామర్శించిన సారయ్య గౌడ్



**పెద్దపల్లి, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తాటి చెట్టు పై నుండి ప్రమాదవశాత్తు పడి గాయపడిన పెద్దపల్లి మండలం భోజన్నపేటకు చెందిన బాలసాని సమ్మయ్య గౌడ్, జూలపల్లి మండలం కాచపూర్‌కు చెందిన పాలకుర్తి రాములు గౌడ్‌లను మాజీ ఎంపీపీ గోపాగోని సారయ్య గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ చింతకుంట విజయరామణారావు సహకారంతో బాధితులకు ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గౌడ సంఘాల నాయకులు పడాల కొమురయ్య గౌడ్, బాలసాని వెంకటేశం గౌడ్, రాజేశం గౌడ్, అంజయ్య గౌడ్, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ లో భారీ చేరికలు



**హుజూరాబాద్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇల్లంతకుంట మండలంలో బీజేపీకి పెద్ద దెబ్బ తగిలింది. సిరిసేడు సర్పంచ్ కుమార్, వంతడుపుల సర్పంచ్ రాజేష్, టేకుర్తి సర్పంచ్ శ్రీనివాస్ బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మంత్రి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో వీరి చేరిక జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ, కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం సాధించిన అభివృద్ధి, సంక్షేమం ప్రజల మనసుల్లో చెక్కుచెదరలేదని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలు ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడంతో గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ వైపు వస్తున్నారని పేర్కొన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలం రోజురోజుకూ పెరుగుతోందని, రాబోయే రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వెంకటేష్ పాల్గొన్నారు.

# నూతన ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే



**దేవరకొండ, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ గుడిపల్లి మండల కేంద్రంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంను ప్రారంభించారు. ఆసుపత్రి విభాగాలను పరిశీలించి, వైద్య సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది" అని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ కేంద్రం ద్వారా సకాలంలో వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసం పెరిగేలా వైద్య సిబ్బంది ఆప్యాయతతో సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. "ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యంత విలువైన సంపద" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వైద్యులు, సిబ్బంది, సర్పంచులు, ప్రజా ప్రతిని ధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థుల ఘన విజయాలు



**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు ఫస్ట్ కిడ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో అత్యధిక బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఓ. ఆశ్రిత (60 మీటర్ల పరుగులో బంగారం), ఆరుష్ (స్టాండింగ్ లాంగ్ జంప్‌లో బంగారం, షాట్‌పుట్‌లో రజతం), ఫైజాన్ (60 మీటర్ల, 400 మీటర్ల పరుగుల్లో బంగారం), సాకిబ్ (జావెలిన్ త్రోలో రజతం), మాన్విత (లాంగ్ జంప్‌లో రజతం, 60 మీటర్లలో కాంస్యం), సిద్ధాంత్ (లాంగ్ జంప్‌లో రజతం), ప్రణ్య (300 మీటర్లలో కాంస్యం), ప్రిధన్ (150 మీటర్లలో కాంస్యం) వంటి విద్యార్థులు మెడల్స్ సాధించారు. విజేతలను అభినందించిన అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, అథ్లెటిక్స్ విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, క్రమశిక్షణ పెంపొందిస్తుందని, రాష్ట్రస్థాయి పోటీల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈనెల 7న హన్మకొండ జె.ఎన్. స్టేడియంలో రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి. విజేతలకు ప్రత్యేక శిక్షణ అందజేస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాషాయంపై కక్ష సాధిస్తున్న కాంగ్రెస్ రెడ్డబోయిన గోపి



**ఇల్లంతకుంట, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ముస్తాబాద్ గ్రామపంచాయతీ భవనానికి వేసిన కాషాయ రంగును కాంగ్రెస్ నాయకులు తొలగించి ఆకుపచ్చ రంగు వేయడం వివాదానికి దారితీసింది. దీనిని నిరసిస్తూ బీజేపీ నాయకులు కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ, గతంలో బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ భవనాలకు పింక్ రంగు వేసినప్పుడు అభ్యంతరం చెప్పని కాంగ్రెస్, ఇప్పుడు కాషాయంపై కక్షతో వ్యవహరిస్తోందని విమర్శించారు. అన్ని గ్రామపంచాయతీ భవనాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్టాండర్డ్ రంగులు మాత్రమే వేయాలని, రాజకీయ రంగులు తొలగించాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ లేని సమయంలో కార్యాలయ తాళాలు పగులగొట్టిన ఎంపీడీఓపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూడా కోరారు. ఆందోళనలో జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి, కార్యదర్శి మీసా సంజీవ్, మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్, మాజీ అధ్యక్షుడు కస్తూరి కార్తిక్ రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.?

# వ్యవసాయ కరెంటు కోతలపై అఖిలపక్ష ధర్నా



**హుస్నాబాద్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వ్యవసాయ రంగానికి కరెంటు కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తూ హుస్నాబాద్ సబ్‌స్టేషన్ ముందు బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ పార్టీలు సంయుక్తంగా ధర్నా నిర్వహించాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు 24 గంటల ఉచిత నాణ్యమైన కరెంటు ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు చేయలేదని నేతలు విమర్శించారు. గత యాసంగిలో 18 గంటల కరెంటు ఇచ్చినా, ప్రస్తుతం వర్షాలు లేక రైతులకు 3--8 గంటలకే పరిమితమైందని, పంటల సాగు తీవ్రంగా ప్రభావితమవుతోందని పేర్కొన్నారు. రైతులకు కనీసం 18 గంటల కరెంటు అందించాలని, లేకపోతే మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని అఖిలపక్ష నేతలు హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బీలు నాయక్, ఐలెని మల్లికార్జున్ రెడ్డి, పచ్చిమట్ల రవీందర్ గౌడ్, బత్తుల శంకర్ బాబు, చిత్తారి శ్రీనివాస్, మారేపల్లి సుధాకర్, బొజ్జ హరీష్, విజయ భాస్కర్, వరియోగుల అనంతస్వామి, మొగిలిపాక శ్రీనివాస్, యాస శ్రీనివాస్, తిరుపతి నాయక్, ఇరుగు రమేష్, రైతు నాయకులు రాఘవరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి మంత్రి వివేకానంద



**మంచిర్యాల, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచి అర్హులైన లబ్ధిదారులకు ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద సూచించారు. మందమర్రి మండలంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సి.ఎస్.ఆర్., డి.ఎం.ఎఫ్.టి. నిధులతో చేపడుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అమృత్ 2.0 పథకంలో చెన్నూర్ నియోజకవర్గంలో రూ. 100 కోట్లతో నీటి ట్యాంకులు, పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయని, ప్రతి ఇంటికి సురక్షిత త్రాగునీరు అందించడమే లక్ష్యమని తెలిపారు. రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపులో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇల్లు అందేలా చర్యలు తీసుకోవాలని, ఇందిరమ్మ ఇళ్లను 3,500 వరకు మంజూరు చేశామని చెప్పారు. వైకుంఠధామాలు, కమ్యూనిటీ హాళ్లు, సెంట్రల్ లైటింగ్, సోలార్ లైటింగ్ వంటి పనులను వేగవంతం చేయాలని సూచించారు. సి.సి. రోడ్లు, మురుగు కాలువలు, నీటి ట్యాంకులు, విద్యుత్ స్తంభాలు వంటి మౌలిక వసతుల పనులను నాణ్యతతో పూర్తి చేయాలని, గుత్తేదారుల పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని, ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించాలని ఆయన సూచించారు. సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో వ్యాధుల నుండి జాగ్రత్తలు తీసుకోవాలి సర్పంచ్ చింతల మల్లేష్



**ఖానాపూర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నుండి రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనే ఉందని దిలావర్పూర్ గ్రామ సర్పంచ్ చింతల మల్లేష్ తెలిపారు. గ్రామంలోని వాడల్లో నిల్వ నీటిని తొలగిస్తూ ప్రజలకు అవగాహన కల్పించిన ఆయన, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, టైర్లు, కుండీలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. నిల్వ నీటితో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని హెచ్చరించారు. నీటిని కాచి తాగాలని, కలరా వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్న పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కారోబార్ పోశెట్టి, ఆశా వర్కర్ మీనుగు కమలతో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
బుధవారం, ఆగస్టు 05, 2026



## ఆచార్య బాలకృష్ణ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మేయర్



**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ 38వ డివిజన్‌లోని కేఎస్ గార్డెన్‌లో ఆచార్య బాలకృష్ణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని భారత స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగ సమితి, యువభారత్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపునిచ్చారు. అనంతరం యోగ సాధకులకు ఔషధ మొక్కలను పంపిణీ చేశారు. మేయర్ మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన జీవన విధానానికి యోగాభ్యాసం, ఔషధ మొక్కలు ఎంతో ఉపయోగకరమని, ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేవసాని సరస్వతి సత్యనారాయణ, మాసం గణేష్, తాటి ప్రభావతి, యోగ నిర్వాహకులు ముత్యాల రమేష్, కమిటీ సభ్యులు, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ పారదర్శకంగా జరగాలి కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును కనీసం రెండుసార్లు పరిశీలించి, అర్హత ప్రమాణాల ప్రకారమే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సరైన కారణం లేకుండా ఏ దరఖాస్తును తిరస్కరించవద్దని స్పష్టం చేశారు.ప్రతి వార్డులో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని, పంపిణీ ప్రక్రియను నిష్పక్షపాతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో కరీంనగర్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జమ్మికుంట కమిషనర్ మల్లికార్జున స్వామి, హుజురాబాద్ కమిషనర్ కిషన్, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మేయర్



**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధి పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. 59వ డివిజన్‌లో రూ.10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో సీసీ డ్రైన్ నిర్మాణ పనులు, 60వ డివిజన్‌లో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయిన తర్వాత స్థానిక కాలనీల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మేయర్ తెలిపారు.ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందని, పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్లు మజీద్ హుస్సేన్, నసీం సుల్తానా ఇబ్రహీం, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలపై కఠిన చర్యలు తీసుకోవాలి గిరిజన సంఘం




**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విజయపురి ఎస్టీ బాయ్స్ హాస్టల్‌లో గడువు ముగిసిన సరుకులను వాడుతున్నారని గిరిజన సంఘం నాయకులు ఆరోపించారు. జిల్లా అధ్యక్షుడు బోడా మోహన్ నాయక్, ప్రధాన కార్యదర్శి భీమా సాహెబ్ ఆధ్వర్యంలో హాస్టల్‌ను సందర్శించిన వారు, పిల్లలకు సరిపడా భోజనం అందించడం లేదని, 120 మంది విద్యార్థులకు కేవలం నాలుగు లీటర్ల పాలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. మెనూ ప్రకారం రెండు కూరలు ఇవ్వాల్సి ఉండగా ఒకే కూర వడ్డిస్తున్నారని, నీళ్ల చారు, నీరు కలిపిన మజ్జిగ వంటివి పిల్లలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.యూనిఫార్ములు ఇప్పటివరకు అందలేదని, పీఈటి, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హాస్టల్‌ను పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలని, లేకపోతే గిరిజన విద్యార్థులు డ్రాప్‌అవుట్స్‌గా మిగిలిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు.సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం డిమాండ్ చేసింది.

## నూతన రేషన్ డీలర్‌గా సంధ్యరాణి బాధ్యతలు స్వీకరణ



**హుస్నాబాద్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న ఇన్‌చార్జి డీలర్ వ్యవస్థకు ముగింపు పలికింది. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ మేరకు గ్రామానికి చెందిన జనవేని సంధ్యరాణిని శాశ్వత రేషన్ డీలర్‌గా నియమించారు.గ్రామ సర్పంచ్ అలువాల శంకర్ ఆధ్వర్యంలో జరిగిన బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు మార్కా రాజు, ఆర్ఐ నాగరాజు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ మాట్లాడుతూ, పారదర్శకంగా, నాణ్యమైన సేవలతో రేషన్ పంపిణీ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా కృషి చేయాలని సూచించారు. గ్రామ ప్రజలు మహిళకు శాశ్వత రేషన్ డీలర్ బాధ్యతలు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, సంధ్యరాణి ఆదర్శవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం మేయర్ శ్రీనివాస్



**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరంలోని 26వ డివిజన్ సుభాష్ నగర్‌లో భారీ వర్షంతో ఓ ఇంటిలోకి వరద నీరు చేరిన ఘటనపై మేయర్ కొలగాని శ్రీనివాస్ తక్షణమే స్పందించారు. సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించిన ఆయన, మున్సిపల్ సిబ్బందితో కలిసి నీటిని ఎత్తిపోసే పనులను పర్యవేక్షించారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి, మున్సిపల్ కార్పొరేషన్ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని మేయర్ ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ రాజ మనోహర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## థింసా నృత్యానికి గిన్నిస్ రికార్డుతో బీజేపీ ఎస్టీ మోర్చా సంబరాలు

**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆంధ్రప్రదేశ్‌లో భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ వేడుకల్లో 13 వేల మంది గిరిజనులు కలిసి చేసిన థింసా నృత్యం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పట్టణం తెలంగాణ చౌక్‌లో బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. గిరిజన కళలకు ప్రపంచస్థాయిలో లభించిన అరుదైన గౌరవాన్ని గుర్తిస్తూ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి, మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమావత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచ వేదికపై వెలుగులు విరజిమ్మడం గర్వకారణమని, ఏపీ ఎన్డీఏ ప్రభుత్వ చొరవతో ఈ గుర్తింపు సాధ్యమైందని అన్నారు. థింసా నృత్యానికి గిన్నిస్ రికార్డు లభించడం మరువలేని అనుభూతి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్, కార్పొరేటర్లు ఎన్నం లక్ష్మీ ప్రకాష్, జితేందర్, మీడియా ఇన్‌చార్జ్ కటకం లోకేష్, సోషల్ మీడియా కన్వీనర్ ఉప్పరపల్లి శ్రీనివాస్, గుంజేటి శివకుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంఘ నరేష్, ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గుగులోతు శ్రీకాంత్ నాయక్, కట్ట రాజు, ఇస్లావత్ శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కుక్కకాటుతో బాలుడికి గాయాలు



**ఖానాపూర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శివాజీ నగర్‌లో ఎనిమిదేళ్ల బాలుడిని కుక్క కరిచి గాయపరిచింది. శ్రీరాం నగర్‌కు చెందిన కరిపె రంజిత్ కుమారుడు అమ్మమ్మ ఇంటికి వెళ్లగా, పిల్లలతో ఆడుకుంటున్న సమయంలో కుక్క దాడి చేసింది.మెడపై కొరికినట్లయితే ప్రమాదం తీవ్రంగా ఉండేదని స్థానికులు తెలిపారు. పట్టణంలోని పలు వార్డుల్లో కుక్కల బెడద పెరుగుతుండగా, వృద్ధులు, పిల్లలు తరచూ గాయపడుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా కుక్కల సమస్యను పరిష్కరించి పట్టణంలో భద్రతా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

## స్వల్పకాలిక పంటలు సాగు చేయాలి డాక్టర్ పి. కవిత




**నందికొట్కూరు, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలినినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు స్వల్పకాలిక పంటలు సాగు చేయాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సూచించారు. అల్లూరు, మల్యాల, వడ్డమాను, బ్రాహ్మణకొట్టుకూరు గ్రామాలను సందర్శించిన శాస్త్రవేత్తలు డాక్టర్ పి. కవిత, డాక్టర్ ఏ. మల్లీశ్వర్ రెడ్డి, ఎలినినో టీమ్ సభ్యులు రైతులకు అవగాహన కల్పించారు. మొక్కజొన్న, కంది, మినుము, పత్తి, సోయాబీన్ పంటలు సాగు చేయాలని, వర్షం వచ్చే వరకు పొటాషియం నైట్రేట్ లేదా 19:19:19 ద్రావణాన్ని పిచికారి చేయడం ద్వారా పంటలు బెట్ట నుండి తప్పించుకోవచ్చని సూచించారు. ఆగస్టు నెలలో ఖాళీగా ఉన్న పొలాల్లో కొర్ర, సజ్జ, మినుము, స్వల్పకాలిక కంది పంటలు సాగు చేస్తే తక్కువ నీటితో కనీస దిగుబడి సాధించవచ్చని తెలిపారు. ఈ సంవత్సరం వరి, మొక్కజొన్న పంటలు వేయక పోవడమే మంచిదని శాస్త్రవేత్తలు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల సహ ఆచార్యులు డాక్టర్ పి.వి. గీతా శిరీష, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరెడ్డి, మండల వ్యవసాయ అధికారి పీ. షేక్షావలి, విస్తరణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

## నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



**నందికొట్కూరు, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యు) డివిజన్ కమిటీ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కె. ఆది మాట్లాడుతూ, నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రంలో మరో జెన్–జెడ్ ఉద్యమం చూడవలసి వస్తుందని హెచ్చరించారు.ఆయన మాట్లా డుతూ , పెండింగ్‌లో ఉన్న రూ.10,700 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు, సంక్షేమ హాస్టళ్ల మెస్ ఛార్జీలు విడుదల చేయాలని కోరారు. విద్యా రంగ సమస్యలపై మంత్రి నారా లోకేష్ స్పందించకపోవడాన్ని విమర్శించారు. డీఎస్సీలో స్పోర్ట్స్ కోటాలో జరిగిన అవకతవకలపై కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో పిడిఎస్యు నాయకులు జగదీష్, శ్యాం నాయక్, అజయ్, శివాజీ, అంజి, శశిధర్, యశ్వంత్, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణానది ఒడ్డున గంగమ్మ దేవర పూజలు



**నందికొట్కూరు, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పగిడ్యాల మండలం గ్రామాల తెలుగు--బెస్త--గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో కృష్ణానది ఒడ్డున గంగమ్మ దేవర పూజలు వైభవంగా జరిగాయి. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ సంఘ నాయకులు, ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మద్దయ్య, పగిడ్యాల, బీరవోలు, సంకిరేణిపల్లె గ్రామాల బెస్త గంగపుత్ర సంఘ సభ్యులు శ్రీనివాసులు, అశ్విని కుమార్, సురేష్, ఆవుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 6న యూడీఐడీ వైకల్య ధ్రువీకరణ శిబిరాలు ఏర్పాటు




**సిద్దిపేట, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సిద్దిపేట జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆగస్టు నెలలో యూడీఐడీ వైకల్య ధ్రువీకరణ శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. ఆగస్టు 6, 13, 20, 27 తేదీల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు జరగనున్నాయి. ధ్రువీకరణ పొందాలనుకునే వారు ముందుగా యూడీఐడీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని, ఆధార్ కార్డు, వైద్య నివేదికలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు వంటి పత్రాలతో ఉదయం 9 గంటలకు ఆసుపత్రిలో హాజరుకావాలని సూచించారు. అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని యూడీఐడీ కార్డును పొందాలని అధికారులు కోరారు.

## నూతన కలెక్టరేట్ ఆర్చి ఆకర్షణీయంగా నిర్మించాలి కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నూతన కలెక్టరేట్‌లో నిర్మిస్తున్న ఆర్చి ఆకర్షణీయంగా, నాణ్యతతో, జిల్లాకు గుర్తింపుగా ఉండేలా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆమె, ఆర్చి నుంచి ప్రధాన రహదారి వరకు పరిసరాలను సుందరంగా అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రధాన గేటు, రహదారి, ల్యాండ్‌స్కేపింగ్, పచ్చదనం, ఇతర మౌలిక సదుపా యాల పనులను ప్రణాళికాబద్ధంగా వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రతి నిర్మాణ పనిలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, కలెక్టరేట్‌కు వచ్చే ప్రతి ఒక్కరిని ఆకట్టుకునేలా ఆర్చి ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి స్వామి, ఆర్ అండ్ బి ఈఈ కుమారస్వామి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలపై ఎన్టీపీసీతో ఎంపీ వంశీ కీలక భేటీ



**రామగుండం, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామగుండం ప్రాంత కార్మికుల సమస్యల పరిష్కారం, స్థానిక యువతకు ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ న్యూఢిల్లీలో ఎన్టీపీసీ ఛైర్మన్ ఽ మేనేజింగ్ డైరెక్టర్ గురదీప్ సింగ్‌ను కలిశారు .ఈ సందర్భంగా ఆయన వినతిపత్రం సమర్పించి, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు గ్రేడ్--బి రేటింగ్ కల్పించి న్యాయమైన వేతనాలు, సంక్షేమ ప్రయోజనాలు అందించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్‌ను ఈఎస్ఐ ఆసుపత్రి ద్వారా సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే జారీ చేసే విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రైవేట్ ఆసుపత్రుల్లో అదనపు ఫిట్‌నెస్ సర్టిఫికేట్ పేరుతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. అదేవిధంగా ఎన్టీపీసీ సూపర్ థర్మల్ విస్తరణ ప్రాజెక్టులో స్థానిక యువతకే ప్రాధాన్యం కల్పించి భారీ ఎత్తున ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని ఎంపీ వంశీ కృష్ణ గట్టిగా డిమాండ్ చేశారు.

## సీజనల్ వ్యాధుల నివారణకై ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్



**హుస్నాబాద్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సీజనల్ వ్యాధుల నివారణ, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపు లక్ష్యంగా పీహెచ్‌సీ మీర్జాపూర్ పరిధిలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ పి. కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టల్‌లను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.గ్రామ సర్పంచ్ వేల్పుల సంపత్ కుమార్ చింతలవాడలో ఇండ్లపై నుంచి వెళ్తున్న హై వోల్టేజ్ విద్యుత్ వైర్ల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వాటిని సురక్షిత దూరంలోకి మార్చాలని ఆదేశించారు.ఆషా డే కార్యక్రమంలో ఆశా కార్యకర్తలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ, ప్రతి రోజు కనీసం 30 గృహాల్లో ఫీవర్ సర్వే నిర్వహించాలని, డ్రై డే కార్యక్రమాలను క్రమం తప్పకుండా చేపట్టాలని సూచించారు.కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణ, గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## విహబ్ ట్రైనింగ్ సెంటర్‌లో షీ టీమ్ అవగాహన సదస్సు



**పెద్దపల్లి, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామగుండం సీపీ ఆదేశాల మేరకు పెద్దపెల్లి విహబ్ ట్రైనింగ్ సెంటర్‌లో మహిళలకు షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఇంచార్జ్ ఎస్ఐ లావణ్య మాట్లాడుతూ మహిళల భద్రత, ప్రవర్తన నియమావళి, ఫోక్సు యాక్ట్, సోషల్ మీడియా ప్రభావం, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం బస్టాండ్, ప్రధాన చౌరస్తాలు, కాలేజీల వద్ద షీ టీమ్ నిఘా ఉంటుందని తెలిపారు.వేధింపులకు గురైతే విద్యార్థులు, మహిళలు భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేయాలని, వివరాలు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో 100/112 నంబర్లకు, ఆన్లైన్ మోసాలకు గురైతే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రయాణ సమయంలో టీ– సేఫ్ యాప్ వాడాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులు సురేష్, మౌనిక, స్నేహలత పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఇన్‌చార్జి ట్రెజరీ అధికారి



**పెద్దపల్లి, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సహాయ ట్రెజరీ అధికారి (ఏటీఓ)గా పనిచేస్తున్న కె. రమేష్‌కు ఇన్‌చార్జి జిల్లా ట్రెజరీ అధికారి (డీటీఓ)గా అదనపు బాధ్యతలు అప్పగించబడిన సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, ట్రెజరీ కార్యాలయ నిర్వహణ, ప్రభుత్వ ఆర్థిక లావాదేవీలు, ప్రజలకు మెరుగైన సేవలందించే అంశాలపై స్వల్పంగా చర్చించారు.

## రైతులకు ఆయిల్ ఫామ్‌పై అవగాహన సదస్సు



**నందికొట్కూరు, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో మాంద్ర శివానంద రెడ్డి పొలంలో నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ స్కీం క్రింద పామ్ ఆయిల్ పంటపై అవగాహన కార్యక్రమం జరిగింది. 3ఎ పి ఆయిల్ ఫామ్ కంపెనీ ఆధ్వర్యంలో ఇండియా హెడ్ కిల్లారు శ్రీనివాసరావు, జోనల్ హెడ్ షేక్ ఫిరోజ్ బాష రైతులకు పామ్ ఆయిల్ పంట ఏర్పాటు, సాగు విధానాలపై వివరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, ఫామ్ ఆయిల్ క్లస్టర్ మేనేజర్ బి. గోపాల్, క్లస్టర్ ఆఫీసర్ దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రాజముద్ర పట్టా పాస్‌బుక్‌ల పంపిణీ



**గడివేముల, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గడివేముల మండలం తిరుపాడు గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి సూచనలతో రాజముద్ర గల పట్టా పాస్ బుక్‌ల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో వెంకటరమణ, వీఆర్వో సామన్న, గ్రామ టీడీపీ నాయకుడు సి. గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మండలి వెంకట కృష్ణారావు జయంతి వేడుకలు



**నందికొట్కూరు, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు విశేష కృషి చేసిన ప్రముఖ విద్యావేత్త, మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు జయంతి వేడుకలను నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాజకీయాల్లో నిజాయితీ, నిబద్ధత, ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన ఆయన నేటి ప్రజాప్రతినిధులకు ఆదర్శమని ఎస్పీ పేర్కొన్నారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ, దివి సీమ ఉప్పెన సమయంలో బాధితులకు అండగా నిలిచిన సేవలకుగాను ఆయనకు "దివిసీమ గాంధీ" బిరుదు లభించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఖాదర్ బాష, చిన్ని కృష్ణ, డీఎస్పీ శ్రీనివాసులు, డీపీవో అధికారులు వీరన్న, ఖాదర్ బాష, కవిత, రిజర్వు ఇన్స్పెక్టర్లు బాబు, విజయ్, సురేష్, ఆర్ఎస్ఐ హర్షవర్ధన్ రెడ్డి, చరణ్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపి డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎమ్మెల్యే



**నందికొట్కూరు, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎమ్మెల్యే గిత్త జయసూర్య మంగళవారం నందికొట్కూరు పట్టణంలోని 13వ వార్డులో ఇంటింటికీ టిడిపి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రూ.7.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డులో డ్రైనేజీ, సీసీ రోడ్డు, ఎలక్ట్రికల్, తాగునీటి సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరిస్తామని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్లు, పట్టణ టిడిపి నాయకులు, టౌన్ సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ, పోలీసు సిబ్బంది, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నేతలు




**నందికొట్కూరు/గడివేముల, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాణ్యం ఎమ్మెల్యే, జిల్లా టిడిపి అధ్యక్షురాలు మరియు అసెంబ్లీ కమిటీ చైర్మన్ గౌరు చరితరెడ్డి జన్మదిన సందర్భంగా పలువురు నేతలు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. గడివేముల మండలం మంచాలకట్ట గ్రామ టిడిపి నాయకులు శ్రీనివాసరెడ్డి, 313వ బూత్ ఇంచార్జ్ కొనిరెడ్డి సూర్య ప్రదీప్, గ్రామ సీనియర్ నాయకులు, దుర్గా భోగేశ్వర ఆలయ చైర్మన్ కంది శీనులు, టిడిపి నాయకులు రమేష్, ఇప్ప మనోహర్, గోపాల్, చిన్న ఉసేని తదితరులు గౌరు చరితరెడ్డిని కలసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య కూడా ఆమెను మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు నిరంతరం సేవ చేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి గౌరు చరితరెడ్డి చేస్తున్న కృషి మరువలేనిదని అన్నారు. ఆమెకు మంచి ఆరోగ్యం, ఆయురారోగ్యాలు కలగాలని, విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు జిల్లా 320ఎ 'యశోత్సవ్' అవార్డుల మహోత్సవం

**- సేవా కార్యక్రమాలు, సభ్యత్వ విస్తరణలో విశిష్టత కనబర్చిన లయన్స్ క్లబ్‌లకు అవార్డులు**



**ఆమనగల్లు, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320ఎ ఆధ్వర్యంలో 2025--26 సంవత్సరానికి సంబంధించిన వార్షిక అవార్డుల మహోత్సవం 'యశోత్సవ్' నేడు (బుధవారం) సాయంత్రం లయన్స్ భవన్‌లో ఘనంగా నిర్వహించనున్నారు. గత ఏడాది వివిధ సేవా కార్యక్రమాలు, సామాజిక సేవా ప్రాజెక్టులు, వైద్య శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, విద్యా సేవలు, సభ్యత్వ విస్తరణలో విశేష కృషి చేసిన లయన్స్ క్లబ్‌లు, సభ్యులకు వివిధ విభాగాల్లో అవార్డులు ప్రదానం చేయనున్నట్లు జిల్లా గవర్నర్ లయన్ డా. జి. మహేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉత్తమ సేవలు అందించిన క్లబ్‌లు, అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులతో పాటు సేవా కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన లయన్స్ నాయకులను ప్రత్యేకంగా సన్మానించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది లయన్స్ సభ్యులు, పదాధికారులు హాజరుకానుండగా, సేవా కార్యక్రమాలపై ప్రత్యేక నివేదికను కూడా ఆవిష్కరించనున్నారు. జిల్లా క్యాబినెట్ సెక్రటరీ తాళ్ల అంజయ్య, జిల్లా ట్రెజరర్ బి.ఆర్. రామ్ రెడ్డి, ఆమనగల్ లయన్స్ క్లబ్ పీఆర్ఓ ఎం.ఎ. పాషా తదితరులు కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు.

## మృతుడి కుటుంబానికి అండగా గోలి శ్రీనివాస్ రెడ్డి

**- వెల్దండలో పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేత**



**ఆమనగల్లు, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రానికి చెందిన మారేపల్లి నిరంజన్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి ధైర్యం చెప్పారు. అనంతరం అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబాలకు అండగా నిలవడం సామాజిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పుట్ట రాంరెడ్డి, జిల్లా నాయకుడు నాగులు నాయక్, మాజీ సర్పంచ్ ముక్కాల శేఖర్, మాజీ ఎంపీ టీసీలు లింగం, నిరంజన్, మాజీ ఉపసర్పంచ్ నిరంజన్, మాజీ మండల అధ్యక్షుడు జోగయ్య, పార్టీ సీనియర్ నాయకులు జంగిలి యాదగిరి, జంగిలి ఆనంద్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొమ్ము నాగయ్య, మంగళగిరి సత్యం, అంజి మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ సంతోష్ రెడ్డికి ఘన సన్మానం

**- ఆమనగల్ పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించిన మేడిగడ్డ తండా నాయకులు**



**ఆమనగల్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)గా బాధ్యతలు స్వీకరించిన సంతోష్ రెడ్డి మేడిగడ్డ తండా గ్రామపంచాయతీ 1వ వార్డు సభ్యుడు మల్లేష్ రాజ్ ఆధ్వర్యంలో గ్రామ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసు అధికారిగా విధులు నిర్వహిస్తూ చట్ట పరిరక్షణలో నిబద్ధతతో పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తూ పోలీసు శాఖపై ప్రజలకు మరింత విశ్వాసం పెంచే విధంగా సేవలందించాలని కోరారు. ఆమనగల్ పట్టణంతో పాటు మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎస్ఐ సంతోష్ రెడ్డి నాయకులకు ధన్యవాదాలు తెలియజేస్తూ ప్రజల సహకారంతో చట్టాన్ని గౌరవించే సమాజ నిర్మాణానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లేష్ రాజ్‌తో పాటు గోపి నాయక్, నందు రాథోడ్, నరేష్ నాయక్, మల్లేష్ నాయక్, చంద్రు నాయక్, తులసీరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం

**- ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించాలి**

**- కౌన్సిలర్ పాపిశెట్టి రాము**



**అమనగల్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమనగల్ మున్సిపాలిటీ 5వ వార్డు అంగన్వాడి కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన శిశువుకు తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే అందించడం ద్వారా సంపూర్ణ పోషకాహారం, రోగనిరోధక శక్తి లభిస్తాయని, ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి పిల్లల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. తల్లి ఆరోగ్యం, శిశువు ఎదుగుదలలో తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు సంధ్య, విమల తల్లులకు తల్లిపాల అవసరం, పోషకాహారం, శిశు సంరక్షణపై అవగాహన కల్పించారు. బాలింతలు, గర్భిణీలకు పోషకాహార సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అనుష శ్రీశైలం, రామన్న మిత్రమండలి సభ్యులు శ్రీను నాయక్, భుజంగం, రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. తల్లులు, గర్భిణీలు, బాలింతలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రింట్ మీడియా వైస్ చైర్మన్ గా కిషన్ గుప్త

**హైదారాబాద్ , ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ 2026-20028 ప్రింట్ మీడియా కమిటీ వైస్ చైర్మన్ గా మిర్ పెట్ కు చెందిన వనపర్తి కిషన్ గుప్త కు నియామక పత్రాన్ని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ గుప్త అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ గుప్త మాట్లాడుతూ... ఆర్యవైశ్య మహాసభ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఆర్యవైశ్యుల కుటుంబాల శ్రేయస్సు కోసం కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించి మహాసభ ప్రతినిధులకు , మహాసభ సభ్యులకు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. కిషన్ గుప్త తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మీడియా కమిటీ వైఎస్ చైర్మెన్ గా నియమితులైన సందర్భంగా రంగారెడ్డి జిల్లా మీడియా కమిటీ చైర్మన్ ప్రొద్దుటూరి రవీందర్ గుప్త తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## లింగారెడ్డిగూడలో వనమహోత్సవం వైభవం



**ఫరూఖ్‌నగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** లింగారెడ్డిగూడ గ్రామంలో మంగళవారం వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులకు పండ్ల మొక్కలను పంపిణీ చేసి, స్థానిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామ సర్పంచ్ ఎంసి ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ మొక్కలు నాటి, "మనం నాటే ప్రతి మొక్క భావితరాలకు దివ్య ఔషధం అవుతుంది. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాము, వార్డు సభ్యులు గోదా లక్ష్మయ్య యాదవ్, మెహరాజ్, శశాంక్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య పాల్గొన్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించారు.

## ధూళికట్ట పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అజ్మీర జ్యోతి



**ఎలిగేడు, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని ధూళికట్ట గ్రామపంచాయతీ కార్యదర్శిగా అజ్మీర జ్యోతి మంగళవారం జీపీ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇంచార్జీగా పనిచేసిన సురేశ్ నుండి ఆమె బాధ్యతలు చేపట్టారు. అజ్మీర జ్యోతి డిప్యూటేషన్‌లో భాగంగా ఓదెల మండలం మడక గ్రామం నుండి బదిలీపై వచ్చి ధూళికట్టలో కొత్తగా బాధ్యతలు స్వీకరించారు. గ్రామస్థులు, అధికారులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో బుక్స్, పెన్నుల పంపిణీ



**ఎలిగేడు, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం కేశెట్టి ఆనందం సుజాత జ్ఞాపకార్థం విద్యార్థులకు బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. వారి కుమారులు కేశెట్టి లక్ష్మణ్ కుమార్, రాజు స్థానిక సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఉపసర్పంచ్ ముంజం నరేష్ కుమార్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాల పిల్లలకు బుక్స్, పెన్నులు అందించడం అభినందనీయం. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తుకు వెలుగునిస్తాయి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బ్రహ్మోజు సంజీవ్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు జ్ఞానేశ్వర్, ఉపాధ్యాయులు జడల సత్యనా రాయణ, మాజీ వార్డు సభ్యులు తాటిపల్లి సతీష్ బాబు, కుటుంబ సభ్యులు మల్యాల రాజేష్, తాటిపల్లి సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

## ర్యాకల్ దేవ్‌పల్లిలో మహిళా గ్రామసభ



**ఎలిగేడు, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని ర్యాకల్ దేవ్‌పల్లి గ్రామంలో మహిళా గ్రామసభను సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, "మహిళలు విద్య, ఉపాధి, ఆర్థిక, సామాజిక రంగాలతో పాటు అన్ని రంగాల్లో సాధికారత సాధించి అభివృద్ధిలో ముందుండాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని స్వయం సమృద్ధి సాధించాలి" అని పిలుపునిచ్చారు. గ్రామసభలో ఉప సర్పంచ్ బొడిగ శివకృష్ణ గౌడ్, వార్డు సభ్యులు ఎడ్ల సతీష్, మడ్డపల్లి జయ, గుడికందుల చంద్రకళ, పంచాయతీ కార్యదర్శి అశోక్, ఫీల్డ్ అసిస్టెంట్ సాగర్, అంగన్వాడి టీచర్ ఓదేశ్వరి, మహిళలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

## ధూళికట్టలో అనుమానాస్పదంగా కోళ్ల మృతి



**ఎలిగేడు, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని ధూళికట్ట గ్రామంలో నాటు కోళ్లు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన కలకలం రేపింది. గ్రామానికి చెందిన అరికిళ్ల చంద్రయ్య అప్పు చేసి తడకలతో షెడ్డు ఏర్పాటు చేసి వెయ్యి నాటు కోళ్లు పెంచుతున్నాడు. అయితే మంగళవారం ఉదయం నిద్రలేచి చూసేసరికి దాదాపు 500 కోళ్లు మృతిచెందాయి. విషప్రయోగం జరిగి ఉండవచ్చని బాధితుడు చంద్రయ్య ఆవేదన వ్యక్తం చేస్తూ, "రెండు లక్షల రూపాయల నష్టం వాటిల్లింది. లబోదిబోమంటూ జీవనం సాగిస్తున్న నాకు ఇది పెద్ద దెబ్బ" అని రోదించాడు. ఈ ఘటనపై ఎలిగేడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కడునిరుపేద కుటుంబానికి చెందిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు, గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ఈ ఘటనపై చర్చనీయాంశంగా మారింది.

RNI - TELTEL/2023/87644

# ఆమనగల్ బీజేపీలో కొత్త జోష్

**– నూతన మోర్చా అధ్యక్షులకు ఘన సన్మానం.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తల్లోజు ఆచారి పిలుపు**



**ఆమనగల్లు, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ మున్సిపాలిటీ బీజేపీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన వివిధ మోర్చా అధ్యక్షులకు మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి ఘనంగా సన్మానం చేశారు. బీజేవైఎం అధ్యక్షుడిగా గోరటి భరత్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా నేనావత్ రఘునాయక్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా సునీత ప్రశాంత్ నాయక్, బీసీ మోర్చా అధ్యక్షుడిగా హరిబాబు, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా బన్నే నరసింహలను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తల్లోజు ఆచారి మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లడంలో మోర్చాల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, సమిష్టి కృషితో ఆమనగల్‌లో బీజేపీని మరింత బలపర్చాలని పిలుపునిచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధ్యక్షులు పార్టీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలతో మమేకమై సంస్థాగతంగా పార్టీని విస్తరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నరసింహ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చెక్కల లక్ష్మణ్, ఆమనగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి, కౌన్సిలర్లు సునీత ప్రశాంత్ నాయక్, ఎర్రవోలు మహేష్, మొక్తల వెంకటయ్య, మాజీ కౌన్సిలర్లు కృష్ణ యాదవ్, చెన్నకేశవులు, దివ్య శ్రీకాంత్ సింగ్, కో-ఆప్షన్ సభ్యుడు అల్లాజీ గౌడ్, పార్లమెంట్ బీజేవైఎం కో-కన్వీనర్ రవి రాథోడ్, నాటు శివ, పద్మ ప్రశాంత్, శ్రీకాంత్ నాయక్, పాపయ్య, జంతుక రమేష్, రవి గౌడ్, శ్రీను, వెంకట్ నాయక్, నరసింహతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని నూతన మోర్చా అధ్యక్షులను అభినందించారు. కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

# నకిలీ ఎరువుల వ్యాపారంపై కఠిన చర్యలు తప్పవు కలెక్టర్ హెచ్చరిక



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రైతుల ప్రయోజనాలను కాపాడడం, నాణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్లు అందుబాటులో ఉండేలా చూడడమే జిల్లా యంత్రాంగం అత్యున్నత ప్రాధాన్యత అని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, "నకిలీ ఎరువుల తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలకు పాల్పడే వ్యక్తులు, ముఠాలపై ఎలాంటి రాజీ లేకుండా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. ఇటీవల బిజినపల్లి, తిమ్మాజిపేట, తాడూరు, కల్వకుర్తి మండలాల్లో నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో ప్రముఖ కంపెనీల పేర్లతో నకిలీ లేబుళ్లు అతికించిన 872 డీఏపీ ఎరువుల బ్యాగులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ కేసులకు సంబంధించి మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, తొమ్మిది మందిలో ఏడుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. రసాయన విశ్లేషణలో నత్రజని, భాస్వరం వంటి కీలక పోషక ప్రమాణాల్లో తీవ్ర లోపాలు ఉన్నట్లు నిర్ధారణ కావడంతో వాటిని అధికారికంగా నాన్-స్టాండర్డ్ / నకిలీ ఎరువులుగా ప్రకటించారు. నిందితులపై నిత్యావసర వస్తువుల చట్టం--1955తో పాటు ఇతర వర్తించే చట్టాల ప్రకారం చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. రైతులు తప్పనిసరిగా లైసెన్స్ పొందిన డీలర్లు, పీఏసీఎస్, రైతు సేవా కేంద్రాల నుంచే ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు కొనుగోలు చేయాలని, ప్రతి కొనుగోలుకు అధికారిక బిల్లు తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద నిల్వలు లేదా అక్రమ విక్రయాలపై వెంటనే స్థానిక మండల వ్యవసాయ అధికారి లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. "రైతులను మోసం చేసే వ్యక్తులు ఎంతటి వారైనా చట్టం ముందు నిలబెట్టి కఠిన చర్యలు తీసుకుంటాం"
అని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు.

# మాదక ద్రవ్య రహిత సమాజం నిర్మిద్దాం కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్లగొండ, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండలోని ఎన్‌జి ప్రభుత్వ కళాశాలలో మంగళవారం నిర్వహించిన "10 కోట్ల మాదక ద్రవ్య రహిత ప్రతిజ్ఞ" మెగా ప్రచార కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రస్తుతం యువత సామాజిక మాధ్యమాలు, డిజిటల్ వ్యసనాలు, డ్రగ్స్, మద్యం, సిగరెట్ వంటి అలవాట్లకు బానిసలవుతున్నారు. ఒకప్పుడు డబ్బున్నవారికి మాత్రమే అందుబాటులో ఉన్న డ్రగ్స్ ఇప్పుడు అందరికీ చేరువయ్యాయి. దీనికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి" అని పేర్కొన్నారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజాన్ని ప్రభావితం చేస్తుందని హెచ్చరిస్తూ, "ఎవరైనా డ్రగ్స్ తీసుకున్నా, అమ్మినా, బలవంతపెట్టినా వెంటనే 1908 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలి" అని సూచించారు. ఇప్పటికే నల్లగొండ జిల్లాలో 97 కేసులు నమోదయ్యాయని తెలిపారు. "2047 స్వాతంత్ర్య శతాబ్ది నాటికి భారత్ ప్రపంచంలో మూడవ ఆర్థిక శక్తిగా ఎదగాలంటే యువత డ్రగ్స్ వంటి అలవాట్లను పూర్తిగా పక్కకు పెట్టాలి. జెన్‌జి తరం డ్రగ్స్ ఫ్రీ తరంగా ఉండాలి"
అని కలెక్టర్ ఆకాంక్షించారు.

# వైభవోపేతంగా విశ్వశాంతి మహాయాగం ముగింపు



**కల్వకుర్తి, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీఎస్ఎన్ఎల్ గ్రౌండ్‌లో 16 రోజులపాటు జరిగిన శ్రీకృష్ణ కాలచక్రం -- శ్రీ సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం 91వ విశ్వశాంతి మహాయాగం సోమవారం వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ మాట్లాడు ఓతూ, "విశ్వశాంతి అంటే రాష్ట్రం, దేశం మాత్రమే కాదు ప్రపంచమంతా శాంతిగా ఉండాలి. దేవతలు సంతోషిస్తే సకాలంలో వర్షాలు కురుస్తాయి, పాడిపంటలు అభివృద్ధి చెందుతాయి, జీవరాశులు సుభిక్షంగా ఉంటాయి" అని తెలిపారు. యాగంలో ఆయుత చండీయాగం, చతుర్వేద హవనాలు, అతిరుద్రయాగం, మహా సుదర్శన యాగం, మహాగణపతి యాగం, మహాసౌర యాగం, మహాలక్ష్మి యాగం, మహా సరస్వతి యాగం వంటి విశిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. రామాయణ, భాగవత హవనాలు, రుద్రాభిషేకాలు, తులసి, కుంకుమ, గాజుల అర్చనలు కూడా జరిగాయి. స్వామీజీ మాట్లాడుతూ, "యజ్ఞం వల్లే సమస్త సృష్టి సుభిక్షంగా ఉంటుంది. మానవులు మానసిక ఉల్లాసం, ఆరోగ్యం, ఐశ్వర్యంతో జీవిస్తారు. సనాతన ధర్మం విలువలను అందరికీ తెలియజేయడమే ఈ యాగం లక్ష్యం" అని పేర్కొన్నారు. ఈ మహాయాగంలో వేలాది మంది భక్తులు పాల్గొని, దాతలు ద్రవ్యదానం, సేవలతో సహకరించారు. "భగవత్ సేవ అంటే కేవలం యజ్ఞం కాదు, తోటి వారిని ఇబ్బందుల్లో ఆదుకోవడం కూడా" అని స్వామీజీ సందేశమిచ్చారు.

## ఎమ్మెల్య చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్న ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతల రాజగోపాల్



**అచ్చంపేట, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ చేతులమీదుగా ఎస్సీ సెల్ నూతన అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అచ్చంపేట తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా చింతల రాజగోపాల్ నియమితులయ్యారు. జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు వంకేశ్వరం నిరంజన్తో పాటు ఇతర మండలాల అధ్యక్షులకు కూడా నియామక పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ, "కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ఎస్సీ వర్గాల సంక్షేమానికి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నూతన అధ్యక్షులు సమన్వయంతో పనిచేయాలి. బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించండి.. ప్రాణాలను కాపాడుకోండి



**– ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు**
**– ఆమనగల్లులో విజిబుల్ పోలీసింగ్.. విస్తృత వాహనాల తనిఖీలు, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఈ-చలాన్లు**



**ఆమనగల్లు, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని ఆమనగల్లు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎస్. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం షాద్‌నగర్ రోడ్డులో విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు రహదారి భద్రతను మెరుగుపర్చేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూనే ప్రజల్లో ట్రాఫిక్ భద్రతపై అవగాహన కల్పించారు. తనిఖీల్లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 25 మంది వాహనదారులకు ఈ-చలాన్లు విధించగా, పెండింగ్‌లో ఉన్న 12 ఈ-చలాన్లను పరిష్కరించి రూ.3,200 జరిమానా వసూలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ ఎస్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. హెల్మెట్ ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని, అతివేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించడం వల్లే అధికశాతం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ కోసం పోలీసులు నిరంతరం విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూనే ఉంటారని, ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించి రోడ్డు భద్రతకు సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్ రెడ్డి పాల్గొని వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, సురక్షిత డ్రైవింగ్, హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# జనరల్ న్యూస్

## నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి అదనపు కలెక్టర్ శ్రీరాములు



**ఎలిగేడు, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వం నిర్దేశించిన పనులను నిర్ణీత గడువలోగా పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీరాములు ఆదేశించారు. మంగళవారం ఎలిగేడు మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తనిఖీ చేసి, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "భూభారతి రీ సర్వే, ఎస్ఐఆర్, సాదాబైనామా దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిశీలించి, అన్నింటినీ గడువులోగా పూర్తి చేయాలి" అని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యాకన్న, డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్రప్రసాద్, ఆరలు చంద్రశేఖర్, జయలక్ష్మి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ధూళికట్టలో చెస్ట్ ఎక్స్‌రే పరీక్షలు



**ఎలిగేడు, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని ధూళికట్ట గ్రామపంచాయతీ కార్యాలయంలో నిక్షయ్ శివర్ కార్యక్రమంలో భాగంగా మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా ఆధ్వర్యంలో చెస్ట్ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని 14 ఏళ్ల పైబడిన వారందరూ తప్పనిసరిగా చెస్ట్ ఎక్స్‌రే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో 110 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమురయ్య, పంచాయతీ కార్యదర్శులు సురేశ్, అజ్మీర జ్యోతి, హెల్త్ సూపర్వైజర్ లక్ష్మన్, డేటా ఎంట్రీ ఆపరేటర్ భాజా, ఎంఎలెచ్పీ డాక్టర్ సింధూర, ఏఎన్ఎం లత, ఆశా వర్కర్లు స్వప్న, శారద, వార్డు సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, గీస బొందయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వంకేశ్వరం మినీ స్టేడియం స్థల పరిశీలన



**పదర, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పదర మండలంలోని వంకేశ్వరం గ్రామంలో మినీ స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. సర్వే నంబర్--254లోని 3 ఎకరాలు 4 గుంటల ప్రభుత్వ భూమిలో స్టేడియం నిర్మాణానికి అనుకూలతను పరిశీలిస్తూ, స్థల విస్తీర్ణం, రాకపోకల సౌకర్యం, భవిష్యత్ విస్తరణ అవకాశాలు వంటి అంశాలను అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మౌలిక వసతులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ప్రతి యువకుడు తన ప్రతిభను ప్రదర్శించుకునేందుకు నాణ్యమైన వేదికలు అందుబాటులో ఉండాలి. వంకేశ్వరం మినీ స్టేడియం పూర్తయిన తర్వాత పదర మండలంతో పాటు పరిసర గ్రామాల యువతకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది" అని తెలిపారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువతకు శిక్షణ, సాధన, పోటీల నిర్వహణకు ఈ స్టేడియం వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. భూ రికార్డులు, సర్వే ప్రక్రియ, సాంకేతిక అనుమతులు, పరిపాలనా ప్రతిపాదనలు ఆలస్యం చేయకుండా పూర్తి చేసి, నిర్ణీత గడువులో పనులను ముందుకు తీసుకెళ్లాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి రేవంత్ చంద్ర, ఎంపీడీవో సుధాకర్, గ్రామ సర్పంచ్ మౌనిక, పంచాయతీ కార్యదర్శి రమ్య, సర్వేయర్ విజయనిర్మల, ఎస్ఐతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మారేపల్లి నిరంజన్ కుటుంబాన్ని పరామర్శించిన మట్ట వెంకటయ్య గౌడ్



**వెల్దండ, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రానికి చెందిన మారేపల్లి నిరంజన్ మరణించిన విషయం తెలుసుకున్న మట్ట వెంకటయ్య గౌడ్ మంగళవారం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, "అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలి" అని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు భూపతి రెడ్డి, కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ వావిళ్ళ ఉమా సంజీవ్ యాదవ్, మత్స్యకార సొసైటీ జిల్లా డైరెక్టర్ క్యాసరపు వెంకటయ్య, వార్డు సభ్యులు పాలాది మల్లీశ్వరి రంగనాథం, గుద్దటి కిష్టల్, గోసుల కొండల్, మసిగుండ్ల వెంకటేష్, సీనియర్ నాయకులు ఎండి అమీద్, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, తుంగ శ్రీను, మట్ట భరత్ గౌడ్, జంగిలి ఆనంద్, గోరేటి భరత్, మట్ట విష్ణు, పుట్ట యాదయ్య, అన్నెపు వెంకటయ్య, రేవల్లి బాలరాజు, మట్ట మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## అనాథ చిన్నారుల విద్యకు యూత్ ఫర్ సేవ చేయూత

**– బ్యాగులు, నోటుబుక్స్ పంపిణీ చేసిన ఫౌండేషన్.. ముఖ్య అతిథిగా కౌన్సిలర్ పాపిశెట్టి రాము**



**ఆమనగల్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** విద్యకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో యూత్ ఫర్ సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని ముర్తుజాపల్లి పాఠశాల, ఆమనగల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు లేని విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోటుబుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ కౌన్సిలర్ పాపిశెట్టి రాము మాట్లాడుతూ అనాథ చిన్నారుల విద్యాభివృద్ధికి సమాజం మొత్తం బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, యూత్ ఫర్ సేవ ఫౌండేషన్ చేస్తున్న సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ముర్తుజాపల్లి పాఠశాల ఉపాధ్యాయులు పబ్బతి అంజనేయులు, బిందు మాధవి, అమనగల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి, ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి, రఘు, రామన్న మిత్రమండలి సభ్యులు నాయక్, భుజంగం, రమేష్ యాదవ్, యూత్ ఫర్ సేవ వాలంటీర్ కదారి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.




# శంకర్ కుమార్తె అదితి కొత్త చిత్రం 'వన్స్ మోర్'...

ప్రముఖ దర్శకుడు శంకర్ కుమార్తెగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి, నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న అదితి శంకర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త చిత్రం 'వన్స్ మోర్'. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ రొమాంటిక్ డ్రామా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అర్జున్ దాస్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాను ఆగస్టు 28న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్టు వెల్లడించింది.విఘ్నేశ్ శ్రీకాంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ప్రకటనతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మిలియన్ డాలర్ స్టూడియోస్ తమ సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని పంచుకుంది. "పండగ రోజు ఇదే. నిరీక్షణకు తెరపడి ప్రేమ మొదలయ్యే చోటు. మా ప్రేమ క్యాలెండర్‌లో ఇష్టమైన తేదీ దొరికింది. 'వన్స్ మోర్' ఆగస్టు 28న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది" అని పోస్ట్ చేసింది.ఈ సినిమాకు పలు ఆకర్షణలు ఉన్నాయి. ముఖ్యంగా, మలయాళంలో 'హృదయం', తెలుగులో 'హాయ్ నాన్న' వంటి చిత్రాలతో చార్ట్‌బస్టర్ ఆల్బమ్స్ అందించి సంచలనం సృష్టించిన ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్, ఈ సినిమాతో తమిళ చిత్ర పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. ఇప్పటికే విడుదలైన కొన్ని పాటలు సంగీత ప్రియులను ఆకట్టుకుంటున్నాయి.అర్జున్ దాస్, అదితి శంకర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో మోడల్, నటి సోనా ఒలికల్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాకు అరవింద్ విశ్వనాథన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, నాష్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. రాజ్ కమల్ ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. మిలియన్ డాలర్ స్టూడియోస్ పతాకంపై యువరాజ్ గణేశన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హరీశ్ దురైరాజ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, విజయ్ ఎంపీ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.

# విశ్రాంతి తీసుకుంటున్న తారక్..

## నాన్ స్టాప్ గా జరుగుతున్న 'డ్రాగన్' షూటింగ్



టాలీవుడ్ అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ భుజానికి గాయమైన సంగతి తెలిసిందే. వైద్యుల సలహా మేరకు ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. డాక్టర్ల పర్యవేక్షణలో మెరుగైన చికిత్స అందుతుండగా, మరో రెండు వారాల పాటు ఆయన షూటింగ్‌కు దూరంగానే ఉండే అవకాశం ఉందని సినీ వర్గాలు వెల్లడించాయి.హీరో అందుబాటులో లేనప్పటికీ ఆయన నటిస్తున్న 'డ్రాగన్' చిత్ర బృందం పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ముందడుగు వేస్తోంది. సమయం వృథా కాకుండా నాన్-స్టాప్ షూటింగ్ కొనసాగిస్తోంది. ప్రస్తుతం ఎన్టీఆర్ లేని సన్నివేశాలను దర్శకుడు ప్రశాంత్ నీల్ చిత్రీకరిస్తున్నట్లు ఇండస్ట్రీ టాక్. ఆయన పూర్తి కోలుకుని సెట్స్‌లో అడుగుపెట్టిన వెంటనే ఆయనకు సంబంధించిన కీలక ఘట్టాలను చిత్రీకరించేలా ప్లాన్ చేస్తున్నారు.కాగా, ఈమధ్య కాలంలో టాలీవుడ్‌లో వరుసగా నటీనటులు గాయపడటం అభిమానులను కలవరపెడుతోంది. ఇటీవల సీనియర్ బాలకృష్ణ, రష్మిక మందన్న, రామ్ చరణ్ కూడా గాయపడిన సంగతి తెలిసిందే.

## అప్పుడు క్లాప్ అసిస్టెంట్.. ఇప్పుడు అదే హీరోకి ప్రొడ్యూసర్..

# నానిది అసలైన విజయం!



సినీ పరిశ్రమలో ఎవరి జాతకం ఎప్పుడు ఎలా మారుతుందో చెప్పలేం. ఒకప్పుడు క్లాప్ అసిస్టెంట్‌గా పనిచేసిన వ్యక్తి, రెండు దశాబ్దాల తర్వాత అదే హీరోతో సినిమా నిర్మించే స్థాయికి ఎదగడం నిజంగా ఓ అద్భుతం. అలాంటి స్ఫూర్తిదాయక ప్రయాణమే నేచురల్ స్టార్ నానిది. హీరో నితిన్ కథానాయకుడిగా, నాని సమర్పణలో 'అలియాస్ రుక్మిణీ' అనే కొత్త చిత్రం నిన్న హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని యూనానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.ఈ సందర్భంగా ఓ ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. సుమారు 21 ఏళ్ల క్రితం, 2005లో కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో నితిన్ హీరోగా నటించిన 'అల్లరి బుల్లోడు' సినిమాకు నాని క్లాప్ అసిస్టెంట్‌గా పనిచేశారు. అప్పట్లో నితిన్‌పై చిత్రీకరించిన సన్నివేశాలకు క్లాప్ కొట్టిన నాని, ఇప్పుడు అదే నితిన్ సినిమాకు నిర్మాతగా మారి ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టడం విశేషం. ఈ రెండు సందర్భాలకు సంబంధించిన ఫొటోలను పోలుస్తూ.. 'ఇదే కదా అసలైన సక్సెస్' అంటూ అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తున్నారు.దర్శకుడు కావాలనే లక్ష్యంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన నాని, లెజెండరీ డైరెక్టర్ బాపు వద్ద 'రాధా గోపాళం' సినిమాకు, ఆ తర్వాత రాఘవేంద్రరావు వద్ద డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేశారు. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా స్వయంకృషితో పైకొచ్చారు. అనుకోకుండా 'అష్టా చమ్మా' చిత్రంతో హీరోగా మారి, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ, సినిమా సినిమాకు తన నటనను మెరుగుపరుచుకుంటూ ప్రేక్షకుల హృదయాల్లో పక్కింటి కుర్రాడిగా స్థానం సంపాదించారు.ఒకప్పుడు మినిమమ్ గ్యారెంటీ హీరోగా పేరు తెచ్చుకున్న నాని, ఇప్పుడు రూ.100 కోట్ల మార్కెట్ ఉన్న స్టార్‌గా ఎదిగారు. హీరోగానే కాకుండా నిర్మాతగానూ అభిరుచి గల చిత్రాలను నిర్మిస్తున్నారు. ఒకప్పుడు క్లాప్ అసిస్టెంట్‌గా ఉన్న స్థాయి నుంచి, అదే హీరోతో సినిమా నిర్మించే స్థాయికి ఎదగడం ఆయన పట్టుదలకు, కష్టానికి నిదర్శనం. త్వరలో ఆయన మెగాస్టార్ చిరంజీవితోనూ ఓ సినిమా చేయనుండటం ఆయన కెరీర్‌లో మరో మైలురాయిగా నిలవనుంది.



# నా పర్సనల్ లైఫ్ గురించి మీకేం తెలుసు?

## : పుకార్లపై అనుపమ పరమేశ్వరన్ ఘాటు స్పందన

యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ ఇటీవల సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్న సందేశాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తమిళ నటుడు ధృవ్ విక్రమ్‌తో ప్రేమాయణం ముగిసిందని, ఆ బ్రేకప్ బాధలోనే ఆవేదనతో కూడిన పోస్టులు పెడుతోందంటూ నెట్టింట పుకార్లు వైరల్ అయ్యాయి. ఈ వార్తలపై తాజాగా ఒక ఇంటర్వ్యూలో స్పందించిన అనుపమ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. "నా అధికారిక సోషల్ మీడియా ఖాతాలో ఏం పోస్ట్ చేయాలనేది పూర్తిగా నా వ్యక్తిగత హక్కు, నా సొంత నిర్ణయం. నా బాధను ఇతరుల ముందు ప్రదర్శించి సానుభూతి పొందాల్సిన అవసరం నాకు లేదు. ఒక సాధారణ మహిళగా జీవితంలో ఎదుర్కొనే మార్పుల గురించే నేను మాట్లాడాను. ఆ మార్పులను సమాజంతో ధైర్యంగా పంచుకోవడం నాకు గర్వంగా అనిపిస్తోంది. నా జీవితం, నా పర్సనల్ లైఫ్ గురించి బయట ఉన్న మీకేం తెలుసు? ఇది నా ఇన్‌స్టాగ్రామ్, నాకు నచ్చినవి నేను పోస్ట్ చేసుకుంటాను. నన్ను ప్రశ్నించడానికి మీరెవరు?" అంటూ ఆమె ఘాటుగా సమాధానమిచ్చింది.మరోవైపు రొటీన్ కథలకు భిన్నమైన ప్రాజెక్టులను ఎంచుకుంటున్న అనుపమ, ప్రస్తుతం 'క్రేజీ కల్యాణం' అనే చిత్రంలో నటిస్తోంది. దర్శకుడు బద్రప్ప సారథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో తరుణ్ భాస్కర్, నరేశ్, అఖిల్ ఉడ్డెమారి కీలక పాత్రలు పోషిస్తున్నారు. పర్సనల్ లైఫ్‌పై వచ్చిన వదంతులకు సూటిగా చెక్ పెట్టిన అనుపమ వ్యాఖ్యలు ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.

# జ్యోతిక నాపై నమ్మకం ఉంచింది..

## అందుకే ఆ సాహసం చేశా: సూర్య



స్టార్ హీరో సూర్య తన 'కరుప్పు' సినిమా విడుదల సమయంలో ఎదుర్కొన్న తీవ్ర ఆర్థిక కష్టాల గురించి తాజాగా వెల్లడించారు. సినిమా విడుదలకు చివరి నిమిషంలో అదనపు రుణాలు తీసుకోవాల్సి వచ్చిందని, ఆ క్లిష్ట సమయంలో తన భార్య జ్యోతిక అండగా నిలబడిందని ఆయన తెలిపారు.

ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో త్రిషతో కలిసి సూర్య నటించిన 'కరుప్పు' చిత్రం 2026 మే 14న విడుదల కావాల్సి ఉండగా, కొన్ని ఆర్థిక సమస్యల కారణంగా ఒకరోజు ఆలస్యమైంది. తమిళనాడులో పంపిణీకి సంబంధించిన లావాదేవీలు కొలిక్కి రాకపోవడంతో ఆ రోజు ఉదయం షోలు రద్దయ్యాయి. దీంతో సూర్య స్వయంగా రంగంలోకి దిగి, వ్యక్తిగతంగా భారీ మొత్తం చెల్లించడంతో పాటు అదనపు నిధులు సమకూర్చి మే 15న సినిమాను విడుదల చేశారు. అనేక అడ్డంకులను దాటుకుని విడుదలైన ఈ చిత్రం, బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సంచలన విజయం నమోదు చేసింది.

ఈ నేపథ్యంలో 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సూర్య ఆనాటి పరిస్థితులను గుర్తుచేసుకున్నారు. "ఈ విషయంలో జ్యోతికకు థ్యాంక్స్ చెప్పాలి. అది చాలా పెద్ద ఆర్థిక భారం. చివరి నిమిషంలో నా మీద పడింది. నేను అదనపు రుణాలు తీసుకుంటున్నప్పుడు ఆమె నాపై నమ్మకం ఉంచింది. ఒకవేళ ఏదైనా తేడా వస్తే, కుటుంబంగా మేమంతా కష్టాలు పడాల్సి వచ్చేది. అయినా ఆమె నా నిర్ణయాన్ని నమ్మింది" అని సూర్య వివరించారు.అయితే, జ్యోతిక మాత్రం ఈ ప్రశంసను స్వీకరించలేదు. "ఈ క్రెడిట్ నేను తీసుకోను. ఇదంతా పూర్తిగా ఆయన కృషే. సినిమాను విజయవంతం చేయాలనే ఆయన ఔదార్యం వల్లే ఇది సాధ్యమైంది" అని ఆమె బదులిచ్చారు. ఈ విజయం వెనుక దర్శకుడు ఆర్‌జే బాలాజీ, ఇతర ఫైనాన్షియర్ల కృషి కూడా ఉందని సూర్య పేర్కొన్నారు.

# ఫ్యామిలీ మెలోడీతో వచ్చిన రవితేజ..

## 'ఇరుముడి' నుంచి కొత్త పాట

మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న కొత్త చిత్రం 'ఇరుముడి' నుంచి మేకర్స్ రెండో పాటను విడుదల చేశారు. 'యాలాలలో యాలాలలో' అంటూ సాగే ఈ మెలోడీ సింగిల్‌ను తాజాగా విడుదల చేశారు. కుటుంబ భావోద్వేగాలతో కూడిన ఈ పాట శ్రోతలను ఆకట్టుకుంటోంది.

ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తుండగా, ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం సమకూర్చారు. ప్రముఖ గాయకులు హేశం అబ్దుల్ వహాబ్, సాధిక కలిసి ఆలపించారు. తెలుగుతో పాటు తమిళంలో కూడా 'మనసు తన్నాలా' పేరుతో ఈ పాటను ఏకకాలంలో విడుదల చేశారు.

'ఇరుముడి' చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. సాయి కుమార్, బేబీ నక్షత్ర, అజయ్ ఘోష్ కీలక పాత్రలలో కనిపించనున్నారు. ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసిన చిత్రబృందం, ఆగస్ట్ 21న ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

